తెలంగాణ

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | సంపుటి: 2 | సంచిక: 200 | బుధవారం 11–12–2024 | పేజీలు: 08 | వెల: 5 | www.telanganamuchatlu.in




# మీడియాపై మోహన్ బాబు దాడి..



## జల్ పల్లిలోని మోహన్ బాబు నివాసం వద్ద మరోసారి ఉద్రిక్తత

- ఇంట్లోంచి చిరిగిన చొక్కాతో బయటికి వచ్చిన మంచు మనోజ్!
- కవరేజికి వెళ్లిన మీడియా ప్రతినిధిని మైక్ తో కొట్టిన మోహన్ బాబు
- మనోజ్ పై మోహన్ బాబు ఇంట్లో దాడి జరిగినట్లు సమాచారం
- మీడియా ప్రతినిధులపై సెక్యూరిటీ సిబ్బంది దాడి
- ఇంటి నుంచి బయటకు వచ్చి ఆవేశంతో ఊగిపోయిన మోహన్‌బాబు
- 'మనోజ్.. నువ్వు నా గుండెల మీద తన్నావ్ రా' : మోహన్‌బాబు

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**

హైదరాబాద్ శివారులోని జల్ పల్లిలో ప్రముఖ నటుడు మోహన్ బాబు నివాసం వద్ద మరోసారి ఉద్రిక్తత నెలకొంది. ఈ సాయంత్రం మంచు మనోజ్, మౌనిక దంపతులు పోలీసు ఉన్నతాధికారులను కలిసి వచ్చాక మోహన్ బాబు నివాసం వద్ద వాడీవేడి వాతావరణం నెలకొంది. మంచు మనోజ్ బలవంతంగా గేటు తోసుకుని ఇంట్లోకి ప్రవేశించారు. అయితే, ఆయన తిరిగి బయటికి వచ్చేటప్పుడు చొక్కా చిరిగి ఉంది. దీన్నిబట్టి లోపల ఘర్షణ జరిగి ఉంటుందని తెలుస్తోంది. కాగా, ఈ వ్యవహారంపై కవరేజీ ఇవ్వడానికి వచ్చిన మీడియా ప్రతినిధులపై మోహన్ బాబు దాడి చేసిన విజువల్స్ దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. మంచు మనోజ్ తో పాటు ఓ రిపోర్టర్ కూడా ఇంట్లోకి ప్రవేశించగా, ఆ రిపోర్టర్ నుంచి మైక్ లాక్కున్న మోహన్ బాబు... మీడియా ప్రతినిధిని కొడుతూ బయటికి తరిమేసే ప్రయత్నం చేశారు. మోహన్ బాబు ఉగ్రరూపం చూసిన విలేకరులు భయభ్రాంతులకు గురయ్యారంటే అతిశయోక్తి కాదు. 'మనోజ్.. నువ్వు నా గుండెల మీద తన్నావ్ రా' : మోహన్‌బాబు

తన కుటుంబంలో చోటు చేసుకున్న పరిణామాలపై సినీనటుడు మోహన్‌బాబు స్పందించారు. మంగళవారం రాత్రి తన నివాసం వద్ద జరిగిన ఘటన అనంతరం ఆయన ఆడియో సందేశం విడుదల చేశారు. ''మనోజ్ నువ్వు నా బిడ్డవి. లక్ష్మీప్రసన్న,

..మిగతా 2 లో

## ఇది ప్రజాపాలన కాదు

# ప్రజాపీడిత పాలన

- చరిత్రను చెరిపేస్తామనే భ్రమను వీడాలి
- కాంగ్రెస్ సర్కారుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచన
- అధికార అహంకారంతో తెలంగాణ తల్లినే మార్చేశారు
- కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ మాయం

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**



కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ట్విటర్ (ఎక్స్) వేదికగా స్పందించారు. ఇది ప్రజా పాలన కాదు.. ప్రజా పీడిత పాలన అని మండిపడ్డారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజల వేదన అరణ్య రోదనగానే మిగిలిందని విమర్శించారు. రైతులను చెరబట్టారని, పేదల ఇండ్లు కూలగొట్టారని ధ్వజ మెత్తారు. రైతుబంధు ఎత్తేశారని, రైతుబీమాకుపాతరేశారని, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ మాయం చేశారని, అమ్మ ఒడిని ఆగం చేశారని దుయ్యబట్టారు. నిరుద్యోగుల ఉసురు పోసుకున్నారని, ఏక్ పోలీస్ అన్న పోలీసులను అణగదొక్కారని చెప్పారు. హామీల అమలు అడిగిన ఆడబిడ్డలు. ఆశాలను అవమానించారని మండిపడ్డారు. టీఎస్ టీజీగా చేసి చార్మినార్, కాకతీయ కళాతోరణాలను తొలగించారన్నారు. తెలంగాణ బిడ్డలు లాఠీలకు, తూటాలకు ఎదురొడ్డి ఆత్మబలిదానాలతో ఉద్యమిస్తున్నప్పుడు.. సమైక్యవాదుల పంచన చేరి వంచన చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార అహంకారంతో ఇప్పుడు ఏకంగా అమ్మనే మార్చారని విమర్శించారు. చరిత్రను చెరిపేస్తామన్న భ్రమలో తెలంగాణ ప్రజలను ఏమారుస్తాం అనుకుంటే పొరపాటేనని చెప్పారు. తెలంగాణ అన్నీ గమనిస్తున్నది. కాలంబు రాగానే కాటేసి తీరుతుందన్నారు.

# భావోద్వేగ క్షణం... మన తల్లి అవతరణం

- సీఎం రేవంత్ ఎమోషనల్ ట్వీట్

**హైదరాబాద్ తెలంగాణ ముచ్చట్లు**



రాష్ట్ర సచివాలయంలో సోమవారం తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ ఘనంగా జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం నాడు ఎమోషనల్ ట్వీట్ చేశారు. 'భావోద్వేగ క్షణం... మన తల్లి అవతరణం' అంటూ సీఎం చేసిన ట్వీట్ ఇప్పుడు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. "భావోద్వేగ క్షణం... మన తల్లి అవతరణం. నాలుగు కోట్ల బిడ్డలం... తీర్చుకున్న రుణం. తల్లీ తెలంగాణమా... నిలువెత్తు నీ రూపం... సదా మాకు స్ఫూర్తిదాయకం" అని సీఎం రేవంత్ ట్వీట్ చేశారు. దీనికి నిన్నటి తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సమయంలో తీసిన వీడియోను ఆయన జోడించారు. మూడు రోజుల ఢిల్లీ టూర్‌సీఎం రేవంత్ మంగళవారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. కుటుంబ సభ్యులతో సాయంత్రం శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఢిల్లీకి వెళ్లారు. ఆ తర్వాత అక్కడి నుంచి రాజస్థాన్‌లోని జైపూర్ వెళ్లనున్నారు. అక్కడ మూడు రోజుల పాటు పర్యటించనున్నారు. డిసెంబర్ 11, 12,13 తేదీల్లో జైపూర్‌లో జరిగే బంధువుల పెళ్లి వేడుకకు సీఎం కుటుంబం హాజరుకానుంది. అక్కడ కార్యక్రమం ముగిసిన తర్వాత రేవంత్ మళ్లీ ఢిల్లీ వెళ్లనున్నారు. ఢిల్లీలో ఏఐసీసీ నేతలతో రేవంత్ సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ప్రస్తుతం పార్లమెంటు శీతాకాల సమావేశాలు జరగనున్న సంగతి తెలిసిందే. ఢిల్లీలో కేంద్ర మంత్రులు అందుబాటులో ఉన్నారు. ఈ క్రమంలోనే రేవంత్.. ఇప్పటికే పలువురు కేంద్రమంత్రుల అపాయింట్మెంట్ తీసుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై వివిధ శాఖల కేంద్ర మంత్రులతో ఆయన సమావేశం కానున్నారు

## శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే

# ప్రభుత్వం ఊరుకోదు

- ఆశా వర్కర్లను అడ్డు పెట్టుకొని రాజకీయం చేస్తోందని ఆగ్రహం
- ఆశావర్కర్లను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం
- ఆశా వర్కర్లు సంయమనం పాటించాలని సూచన
- దామోదర రాజనర్సింహ

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**



ఆశా వర్కర్లను అడ్డం పెట్టుకొని ప్రతిపక్ష పార్టీ రాజకీయం చేస్తోందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆరోపించారు. తెలంగాణ అస్తిత్వాన్ని చాటేలా విజయోత్సవాలు నిర్వహిస్తుంటే ప్రతిపక్ష పార్టీ నేతలు తట్టుకోలేకపోతున్నారని మండిపడ్డారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే ఆశా వర్కర్లను రెచ్చగొట్టారని విమర్శించారు. గత పదేళ్ల పాలనలో ఆశా వర్కర్ల వేతనాల పెంపుపై ఎన్నిసార్లు నిరసనలు, ధర్నాలు చేసినా పట్టించుకోని భారాస.. ఇప్పుడెందుకు మొసలి కన్నీరు కారుస్తోందని నిలదీశారు. భారాస ద్వంద్వ వైఖరికి ఆశా వర్కర్ల నిరసనలే నిదర్శనమన్నారు. "2015లో వేతనాలు పెంచాలంటూ 106 రోజులు ఆశా వర్కర్లు ధర్నాలు చెసినా

..మిగతా 2 లో

## 'ప్రజావాణి'

# కార్యక్రమాన్ని కొనసాగిస్తాం

- ప్రజావాణిలో ఇచ్చిన దరఖాస్తులు పరిష్కారమవుతున్నాయని వెల్లడి
- ప్రజలకు జవాబుదారిగా ఉండాలనేది తమ లక్ష్యమన్న భట్టివిక్రమార్క
- ప్రజల కోసమే ఉన్నామనే భావన అధికారులు కల్పించాలని సూచన

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**



ఎన్ని ఇబ్బందులొచ్చినా 'ప్రజావాణి' కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో కొనసాగిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ''ప్రజావాణిలో ఇచ్చిన దరఖాస్తులు పరిష్కారం అవుతున్నాయి. ప్రతి పౌరుడికి నమ్మకం కలిగేలా ప్రజావాణి నిర్వహిస్తున్నాం. ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, ప్రజల అవసరాలు తీర్చాలనేదే మా ప్రభుత్వ లక్ష్యం. మీ కోసమే మేం ఉన్నామనే భావన అధికారులు.. ప్రజలకు కల్పించాలి. రాజ్యాంగ పీఠికలోని లక్ష్యాలను ప్రజలకు అందించాలని ప్రయత్నిస్తున్నాం'' అని భట్టి విక్రమార్క తెలిపారు.

# రాజ్యసభ చైర్మన్ పై అవిశ్వాస తీర్మానం

- పార్లమెంట్ చరిత్రలో ఇదే తొలిసారి
- అవిశ్వాస తీర్మానంపై 50 మంది విపక్ష సభ్యుల సంతకాలు
- సంపూర్ణ మద్దతు ప్రకటించిన ఇండియా కూటమి
- సభలో మైక్ ఇవ్వడం లేదనే ఆరోపణలతో
- ఆవిశ్వాస తీర్మానం ఇచ్చిన వెంటనే కట్ చేస్తున్నారని విపక్షాల ఆరోపణ

**తెలంగాణ ముచ్చట్లు,న్యూఢిల్లీ :**



రాజ్యసభ చైర్మన్ జగ్దీప్ ధన్కర్ పై ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. ఎగువ సభలో చైర్మన్ వ్యవహరిస్తున్న తీరు ఏకపక్షంగా ఉంటోందని ఎంపీలు ఆరోపిస్తున్నారు. "రాజ్యసభ నుంచి తాము తరచూ వాకౌట్ చేయాల్సిన పరిస్థితికి చైర్మన్ ధనఖర్ వైఖరే " కారణమని విపక్ష ఎంపీలు విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం చైర్మన్పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానంపై ఇండియా కూటమి పార్టీలైన తృణమూల్, ఆమ్ ఆద్మీపార్టీ, సమాజ్ వాదీపార్టీ, డీఎంకే, ఆర్జేడీ తదితర పార్టీలకు చెందిన 50 మందికి పైగా ఎంపీలు సంతకాలు చేశారు. ఎంపీలు సంతకాలు చేసిన ఈ నోటీసులను రాజ్యసభ సెక్రటేరియట్కు సమర్పించారు. చైర్మన్కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెట్టడం భారత పార్లమెంటరీ చరిత్రలోనే ఇది మొదటిసారి. రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మాట్లాడేందుకు లేచి నిలబడినప్పుడు చైర్మన్ ఆయనకు అవకాశం ఇవ్వాలని, కాని కాంగ్రెస్

..మిగతా 2 లో



# మార్చి నాటికి లక్ష ఎకరాల్లో పామాయిల్ ప్లాంటేషన్

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**

వ్యవసాయ యాంత్రీకరణ, డ్రీప్ ఇరిగేషన్ పథకాల అమలును వేగవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అధిక మొత్తంలో రైతులకు లబ్ధి చేకూర్చాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ రాష్ట్రస్థాయి అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. వివిధ పథకాల పురోగతిపై అధికారులతో మంత్రి విస్తృతంగా చర్చించారు. ప్రాథమిక సహకార సంఘాల బలోపేతంపైనా మంత్రి దిశానిర్దేశం చేశారు.

గత ప్రభుత్వ హయాంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను పూర్తి స్థాయిలో వినియోగించే విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు తుమ్మల సూచించారు. వచ్చే ఏడాది మార్చి నాటికి లక్ష ఎకరాల్లో పామాయిల్ ప్లాంటేషన్ లక్ష్యాన్ని పూర్తి చేయాలని.. ఇందుకోసం అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.




# డిజిటల్ యుగంలో మానవ హక్కులకు పెను సవాళ్లు

- మానవ హక్కుల దినోత్సవంలో పాల్గొన్న రాష్ట్రపతి
- ఏఐ ప్రజల జీవితాల్లో సమస్యలు సృష్టిస్తోంది
- సవాళ్లకు పరిష్కారం మనమే కనుగొనాలి
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**తెలంగాణ ముచ్చట్లు, ,నేషనల్ బ్యూరో:**

డిజిటల్ యుగంలో సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం విస్తృతమవుతుందని రాష్ట్రపతి ద్రౌపదే ముర్ము ఆవేదన వ్యక్తం చేశారు. సైబర్ నేరాలు, డీప్ ఫిక్, ప్రజల గోప్యతకు భంగం కలిగిస్తున్నాయన్నారు. ప్రజల హక్కులను కాపాడటం చాలా ముఖ్యమని ఆమె అన్నారు. 'మానవ హక్కుల దినోత్సవం' సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి పాల్గొని ప్రసంగించారు. భారత్ అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలిచేందుకు తీవ్రంగా కృషి చేస్తున్న నేపథ్యంలో సైబర్ నేరాలతో పాటు వాతావరణంలో వచ్చే వివిధరకాల మార్పులను ఎదుర్కొంటోందని ముర్ము అన్నాడు. ప్రస్తుతం ప్రజల జీవితాల్లో ప్రభావం గురించి ఆమె మాట్లాడుతూ. ఆర్థిపిషీయల్ ఇంటిలిజెన్లోజు వారీ జీవితంలో ప్రవేశించింది. మన సమస్యలను పరిష్కరిస్తోంది. కానీ మనకు తెలియకుండానే పలు కొత్తసమస్యలను సృష్టిస్తోంది. దీనికి ప్రాణం లేకపోయినా సృష్టించింది మానవుడే కాబట్టి ఈ సవాళ్లకు మనమే తగిన పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉంది' అని తెలిపారు. సార్వత్రిక మానవ హక్కుల పరిరక్షణ ప్రకటనను ఐక్యరాజ్య సమితి సాధారణ సభ 1948లో ఆమెదించింది. ఏటా డిసెంబరు 10న అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం జరుపుకొంటున్నాం ఇందులోభాగంగా రూపొందించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను 2030 నాటికి సాకారం చేయాలని పిలుపునిచ్చింది.

# మీడియాపై మోహన్ బాబు దాడి..

మొదటి పేజీ తరువాయి

విష్ణువర్ధన్‌బాబు, మనోజ్ కుమార్ మిమ్మల్ని ఎలా పెంచాను? అందరికంటే నిన్నే గారాబంగా పెంచాను. నీకే ఎక్కువ ఖర్చుపెట్టి చదివించాలని ప్రయత్నించాను. నువ్వు ఏది అడిగినా నీకు ఇచ్చాను. నువ్వు ఈరోజు నా గుండెల మీద తన్నావ్. నా మనసు ఆవేదనతో కుంగిపోతోంది. నా బిడ్డ నన్ను తాకలేదు. కొన్ని కారణాల వల్ల ఇద్దరం ఘర్షణ పడ్డాం. ప్రతి కుటుంబంలోనూ ఘర్షణలు ఉంటాయి.
జల్‌పల్లి ఇల్లు నా కష్టార్జితం.. నీకు సంబంధం లేదు. మంచు మనోజ్ మద్యానికి బానిసగా మారాడు. మద్యం మత్తులో ఎలాగో ప్రవర్తిస్తున్నాడు. ఇంట్లో పనిచేస్తున్న వారిపై దాడికి దిగడం మనోజ్‌కు సరికాదు. ఇక చాలు నా పరువు ప్రఖ్యాతలు మంటగలిపావు. నన్ను ఎవరూ మోసగాడు అనలేదు. నీకు జన్మనివ్వడమే నేను చేసిన పాపమా? ఆస్తులు ముగ్గురికీ సమానంగా రాయాలా? వద్దా? అనేది నా ఇష్టం. ఆస్తులు ఇస్తానా.. లేదా.. దాన ధర్మాలు చేస్తానా? అనేది నా ఇష్టం నా ఇంట్లో అడుగు పెట్టడానికి నీకు అధికారం లేదు. మనోజ్ నీ వల్ల మీ



అమ్మ ఆసుపత్రిలో చేరింది. భార్య మాటలు విని తాగుడుకు అలవాటు పడ్డావు. తప్పు చేయనని చెప్పి మళ్లీ ఇంట్లోకి వచ్చావు. మోహన్ బాబు కొడతాడు, తిడతాడు అనేది సినిమా షూటింగ్‌ల్లో తప్ప ఇంట్లో కాదు. నా ఫిర్యాదుపై పోలీసులు స్పందించ లేదు. నా ఇంట్లోకి ఎవరినీ రానివ్వకుండా అడ్డుకోవాల్సిన పోలీసులు చూస్తూ ఊరుకున్నారు. పోలీసు శాఖ అంటే నాకెంతో గౌరవం ఉంది. న్యాయం, ధర్మంగా నడుచుకోవాలి. మనోజ్ వచ్చి తన బిడ్డను తీసుకెళ్లొచ్చు. రాకపోతే ఆ బిడ్డను జాగ్రత్తగా పెంచుతా. ఆసుపత్రి నుంచి మీ అమ్మ డిశ్చార్జ్ అయిన తర్వాత .. పోలీసుల సమక్షంలో నీకు అప్పగించమని చెబుతా. ఇక చాలు.. ఇంతటితో గొడవకు ముగింపు పలుకుదాం'' అని మనోజ్‌కు పంపిన ఆడియో సందేశంలో పేర్కొన్నారు.

**చిరిగిన చొక్కాతో బయటకు వచ్చిన మనోజ్..**

**జల్‌పల్లిలో సినీనటుడు మోహన్‌బాబు నివాసం వద్ద మంగళవారం రాత్రి ఉద్రిక్తత చోటు చేసుకుంది. తెలంగాణ అదనపు డీజీపీని కలిసిన అనంతరం మనోజ్ దంపతులు మోహన్‌బాబు నివాసానికి చేరుకోగా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. భద్రతా సిబ్బంది గేట్లు తీయకపోవడంతో.. 'నా కుమార్తె లోపల ఉంది' అంటూ మనోజ్ అక్కడి భద్రతా సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గేట్లు తోసుకుని లోపలికి దూసుకెళ్లారు. మనోజ్ వెంట వచ్చిన బౌన్సర్లను పోలీసులు బయటకు పంపించేశారు. దాడి జరగడంతో చిరిగిన చొక్కాతోనే మనోజ్ బయటకు వచ్చారు.**



## భారతీయులకు గుడ్‌న్యూస్ చెప్పిన డొనాల్డ్ ట్రంప్

**తెలంగాణ ముచ్చట్లు,డెస్క్ :**

వచ్చే ఏడాది జనవరిలో డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తాను అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టగానే అక్రమ వలసదారులను వెళ్లగొడతానని చెప్పారు. చట్టబద్ధంగా అమెరికాకి వలస వచ్చే వారికి మార్గం సులువు చేస్తానన్నారు. దీనివల్ల ఇది భారతీయులకు ఎక్కువ ప్రయోజనం కలగనుంది. ఎన్‌బీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ పలు విషయాలు వెల్లడించారు. '' అమెరికాలో ప్రవేశం పొందానుకునేవారు ముందాగా ఈ దేశాన్ని ప్రేమించాలి. స్టాట్యూ ఆఫ్ లిబర్టీ గురించి చెప్పగలిగేలా ఉండాలి.
పలు దేశాల జైళ్ల నుంచి నేరస్థులు నేరుగా అమెరికాకి వచ్చేస్తున్నారు. మొత్తం 13,099 మంది నేరస్థులు అమెరికా విధుల్లో స్వేచ్ఛగా తిరుగుతున్నారు. ఇలాంటి వ్యక్తులను దేశంలో ఉంచకూడదు. వెంటనే తరిమికొట్టాలి. అమెరికాకు అక్రమంగా వలస వచ్చిన దంపతుల సంతానంలో చాలామంది ఇక్కడే పుట్టి పెరిగారు. వాళ్లలో చాలామంది పెద్ద ఉద్యోగాలు, వివిధ వృత్తుల్లో స్థిరపడ్డారు. వీళ్ల సమస్యను పరిశీలిస్తాం. విపక్ష డెమోక్రాట్లతో కలిసి ఈ సమస్యకు పరిష్కారం చూపుతామని'' ట్రంప్ అన్నారు.
ఇదిలాఉండగా.. పొరుగుదేశాలైన కెనడా, మెక్సికోల నుంచి అమెరికాకు లక్షలాది మంది అక్రమ వలసదారులు వస్తున్నారని ట్రంప్ తెలిపారు. దీన్ని అరికట్టకపోతే ఆ రెండు దేశాలపై 25 శాతం సుంకం విధిస్తానని ఇప్పటికే స్పష్టం చేశారు. దీంతో ఈ రెండు దేశాలు దీనిపై ప్రశ్నించగా.. చివరికీ కెనడా, మెక్సికోలు అమెరికాలో 51వ, 52వ రాష్ట్రాలుగా చేరిపోవడం మంచిదంటూ సలహా ఇచ్చారు. ఇదిలాఉండగా.. అమెరికా ఇప్పటికే మెక్సికోకు 30 వేల కోట్ల డాలర్లు, కెనడాకు 10 వేల కోట్ల డాలర్ల చొప్పున రాయితీలు ఇస్తోందని.. వీటిని ఆపాల్సిన అవసరం ఉందని ట్రంప్ పేర్కొన్నారు. అయితే చైనా తదితర దేశాలపై సుంకాలు పెంచినట్లైతే సరకుల ధరలు పెరిగా సామాన్య అమెరికన్ ప్రజలు నష్టపోతారని పలు కంపెనీలు సీఈవోలు హెచ్చరిస్తున్నారు. కానీ ట్రంప్ మాత్రం వాటిని తోసిపుచ్చారు. సుంకాల సాయంతోనే తాను యుద్ధాలను ఆపగలిగానని స్పష్టం చేశారు.



## ట్రంప్ పాలకవర్గంలో మరో భారత సంతతికి చోటు

**తెలంగాణ ముచ్చట్లు,డెస్క్ :**

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలిచిన డొనాల్డ్ ట్రంప్ వచ్చే ఏడాది జనవరి 20న అధ్యక్ష పదవికి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ క్రమంలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తాజాగా ట్రంప్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. భారత సంతతికి చెందిన హర్మీత్ కె. ధిల్లాన్‌ను పౌర హక్కుల సహాయ అటార్నీ జనరల్‌గా నియమిస్తున్నట్లు సోషల్ మీడియ వేదికగా తెలిపారు.
పౌర హక్కులను కాపాడేందుకు..
అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్‌లో సివిల్ రైట్స్ కోసం అసిస్టెంట్ అటార్నీ జనరల్‌గా హర్మీత్ కె. ధిల్లాన్‌ను నామినేట్ చేయడం సంతోషంగా ఉందన్నారు. పౌర హక్కులను కాపాడేందుకు ఎంతో కృషి చేశారని, కరోనా సమయంలో ప్రార్థనలు చేసుకోకుండా న్యాయపరంగా ఎంతో పోరాడన్నారు.
అగ్రశేణి న్యాయవాదుల్లో ఒకరైన ఆమె రాజ్యాంగ, పౌర హక్కులను, ఎన్నికల చట్టాలను అమలు చేయడంలో న్యాయంగా ఉంటారని నమ్ముతున్నానని ట్రంప్ పోస్ట్ చేశారు. భారత్‌లోని చండీగఢ్‌లో జన్మించిన హర్మీత్ కె.ధిల్లాన్ చిన్నతనంలోనే కుటుంబం అమెరికాకు వెళ్లి స్థిరపడింది. లా చదివిన ఆమె 2006లో సొంతంగా ధిల్లాన్ లా గ్రూప్ పేరుతో సంస్థను ఏర్పాటు చేసుకుంది.




## ఇజ్రాయెల్‌ను చూసి నేర్చుకోవాలి అస్సాం సీఎం హిమంత

**తెలంగాణ ముచ్చట్లు,డెస్క్ :**

అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ కీలక వ్యాఖ్యలు చేశారు. చుట్టూ శత్రువులు ఉన్నప్పటికీ ఎలా మనుగడ సాగించాలో ఇజ్రాయెల్ నుంచి అస్సాం నేర్చుకోవాలని వ్యాఖ్యానించారు. అస్సాం సరిహద్దులు ఎప్పుడూ సురక్షితంగా లేవని, రాష్ట్రంలో అనేక జిల్లాల్లో అస్సామీలు మైనారిటీలుగా ఉన్నారని ఆవేదన వ్యక్తంచేశారు.
'బంగ్లాదేశ్, మయన్మార్, పశ్చిమ బెంగాల్‌తో మనకు సరిహద్దు ఉంది. 12 జిల్లాల్లో అస్సామీలు మైనారిటీలుగా ఉన్నాం. చుట్టూ శత్రువులు ఉన్నప్పటికీ విజ్ఞానం, శాస్త్ర సాంకేతికతలను వినియోగించుకొని ఇజ్రాయెల్ బలమైన దేశంగా మారింది. అటువంటి దేశాల చరిత్రల గురించి తెలుసుకోవాలి. అప్పుడే ఒక జాతిగా మనుగడ సాగించగలం'' అని అస్సాం ముఖ్యమంత్రి పేర్కొన్నారు.అస్సాం ఒప్పందం జరిగి నలభై ఏళ్లు గడుస్తున్న బయటి శక్తుల ముప్పు తొలగిపోలేదని హిమంత బిశ్వశర్మ పేర్కొన్నారు. నిత్యం జనాభాలో మార్పు జరుగుతోందని, స్థానిక ఆదివాసీలు తమ హక్కులను కోల్పోతున్నారని అన్నారు.

## శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ప్రభుత్వం ఊరుకోదు

మొదటి పేజీ తరువాయి



పట్టించుకునే వారు లేకపోయారు. ఆ తర్వాత కూడా ఆశా వర్కర్లు అనేక సార్లు సమ్మెలు, ధర్నాలు చేశారు. భారాస అధికారంలో ఉన్నప్పుడు వారి సమస్యలను పరిష్కరించలేదు. అలాంటి వారు ఇప్పుడు ఎందుకు మాట్లాడుతున్నారు? ఆశా వర్కర్లు సంయమనం పాటించాలి. రాజకీయంగా ప్రేరేపించే వారి ఉచ్చులో పడొద్దు. ప్రజా ప్రభుత్వం ఆశా వర్కర్ల స్వేచ్ఛను గౌరవిస్తుంది. శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా ప్రవర్తిస్తే మాత్రం ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు'' అని మంత్రి హెచ్చరించారు.

## రాజ్యసభ చైర్మన్ పై అవిశ్వాస తీర్మానం

మొదటి పేజీ తరువాయి



అధ్యక్షుడు, సభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే లేచి నిలబడగానే మైక్రోఫోను చైర్మన్ తరచు కట్ చేస్తున్నారని విపక్ష ఎంపీలు వాదిస్తున్నారు. పార్లమెంటరీ నిబంధనలు, సాంప్రదాయాల ప్రకారం సభ నడవాలని, కాని తాము ఫిర్యాదు చేసిన ప్రతిసారి తమను ఛాంబర్లోకి పిలిచి సర్దుబాటు చేసేందుకు చైర్మన్ ప్రయత్నిస్తున్నారే తప్ప నిబంధనలను పాటించాలని భావించడం లేదని సీనియర్ ప్రతిపక్ష నాయకుడు ఒకరు తెలిపారు. దీంతోనే ఆయనపై అవిశ్వాసతీర్మానం పెట్టినట్లు విపక్షాలు వెల్లడించాయి.

## రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో మంత్రి సీతక్క భేటీ

**న్యూఢిల్లీ,తెలంగాణ ముచ్చట్లు:**



తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క పార్లమెంటు ఆవరణలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో సమావేశమయ్యారు.
ఈ సందర్భంగా, తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, రాష్ట్రంలో ఉన్న తాజా రాజకీయ పరిస్థితుల గురించి రాహుల్ గాంధీకి వివరించారు.
మంత్రి సీతక్క, ఇటీవలి వయనాడ్ పార్లమెంటు ఉప ఎన్నికల్లో విజయఢంకా మోగించిన ప్రియాంక గాంధీకి శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ భేటీ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది, తెలంగాణ కాంగ్రెస్ భవిష్యత్ కార్యచరణకు సంబంధించిన అనేక కీలక అంశాలు ఈ సందర్భంగా చర్చించబడినట్టు సమాచారం.

## కర్ణాటక మాజీ సీఎం ఎస్ఎం కృష్ణ కన్నుమూత

**తెలంగాణ ముచ్చట్లు, స్టేట్ బ్యూరో:**



కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి ఎస్ఎం కృష్ణ (92) మంగళవారం బెంగళూరులోని సదాశివనగర్‌లో తెల్లవారుజామున కన్ను మూశారు. ఐదు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కృష్ణ.. కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించారు. తన హయాంలో బెంగళూరును భారత సిలిక్యాన్ వ్యాలీగా ప్రపంచానికి సరికొత్తగా పరిచయం చేశారు. కర్ణాటకలోని మండ్య జిల్లా సోమనహళ్లిలో 1932 మే 1న సోమనహళ్లి మల్లయ్య కృష్ణ జన్మించారు. మద్దూర్ నియోజకవర్గం నుంచి గెలుపొంది 30 ఏళ్లకే అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఆ తర్వాత కొంతకాలం పాటు ప్రజా సోషలిస్ట్ పార్టీలో పనిచేసి అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. హస్తం పార్టీలో సీనియర్ నేతగా కొనసాగిన కృష్ణ.. పలు కీలక పదవులు నిర్వర్తించారు. 19992004 మధ్య కర్ణాటక 16వ ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2004 డిసెంబర్ నుంచి 2008 మార్చి వరకు మహారాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం యూపీఏ హయాంలో 2009 2012 మధ్య విదేశాంగ మంత్రిగా వ్యవహరించారు.



## 'జిల్లా పర్యటనలో ఓకే అంటారు.. సచివాలయానికొస్తే పైసల్లేవంటారు'

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**

అసెంబ్లీ లాబీలో సోమవారం మీడియా సమక్షంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిల మధ్య సరదా సంభాషణ జరిగింది. 'బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టుతో వచ్చే ఐదేళ్లలో నల్గొండ జిల్లా స్వరూపం మారుతుంది. నాకో ఎకరం ఇవ్వవా అన్నా' అని కోమటిరెడ్డిని ఉద్దేశించి భట్టి అన్నారు. 'జిల్లా పర్యటనలో ఉన్నప్పుడు ఏం అడిగినా భట్టివిక్రమార్క ఓకే అంటున్నారు. సచివాలయానికి పనికోసం వస్తే పైసలు లేవంటున్నారు' అని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. వైఎస్సార్ సమయంలో ఆర్థిక క్రమశిక్షణ కనిపించేదని.. మళ్లీ ఇప్పుడు భట్టివిక్రమార్క వద్ద అది కనిపిస్తోందని చెప్పారు. ఈ నెల 15, 16 తేదీల్లో అన్ని వసతిగృహాల్లో జిల్లా కలెక్టర్ల భోజన కార్యక్రమం ఉంటుందని భట్టి తెలిపారు.

**కేసీఆర్ లేకుంటే కేటీఆర్ ఎమ్మెల్యే అయ్యేవారా?**

'కేసీఆర్ లేకుంటే కేటీఆర్ ఎమ్మెల్యే అయ్యేవారా? కేటీఆర్‌తో మాకు పోలిక ఏంటి? ఆయన భవిష్యత్తులో సీఎం అయినా మేం విలువ ఇవ్వం' అని కోమటిరెడ్డి అన్నారు. అసెంబ్లీ లాబీలో ఆయన విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. 'తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ పుట్టినరోజున కేసీఆర్ శాసనసభకు వచ్చి ఆమెకు కృతజ్ఞతలు తెలపరా?' అని కోమటిరెడ్డి అన్నారు.



## హైదరాబాద్‌లో మరో మూడు స్కైవాక్‌లు..

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**

హైదరాబాద్‌లో రోజురోజుకు అభివృద్ధి పనులు జరుగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే రేవంత్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలో మరో మూడు కొత్త స్కైవాక్‌లు నిర్మించనుంది. ఇందుకోసం అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటికి పర్మిషన్ రాగానే పనులు ప్రారంభించనున్నారు. అల్విన్‌కాలనీ చౌరస్తా, మియాపూర్, ఆరాంఘర్ కూడళ్ల వద్ద కొత్తగా స్కై వాక్‌ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. అనుమతులు వచ్చాక వీటి నిర్మాణం జరగనుంది.
అయితే హెచ్‌సిటీలో భాగంగా ఇప్పటికే ఉప్పల్ కూడలిలో స్కైవాక్ అందుబాటులోకి వచ్చింది. మొత్తం రూ.25 కోట్ల వ్యయంతో రామంతాపూర్ రోడ్డు, నాగోల్, వరంగల్ రోడ్డు, మెట్టుగూడ మార్గాలతో పాటు ఉప్పల్ మెట్రో స్టేషన్‌కు లింక్ చేస్తూ ఈ స్కైవాక్‌ను నిర్మించారు. దీనికి అన్నివైపులా మెట్లు, లిఫ్టులు ఏర్పాటు చేశారు. ఇక రహేజా మైండ్‌స్పేస్ ప్రాంగణంలో కూడా ఇలాంటి నిర్మాణం ప్రజలకు ఉపయోగకరంగా ఉంది. ఈ నేపథ్యంలోనే నగరంలో మరిన్ని స్కైవాక్‌లు అవసరమని జీహెచ్‌ఎంసీ ఇటీవలే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. ఇదిలాఉండగా.. మున్సిపల్ శాఖ హెచ్‌సిటీ ప్రాజెక్టు కింద రూ.5,942 కోట్ల అంచనా వ్యయంతో 23 పనులు చేపట్టాలని HMDAకు పర్మిషన్ ఇచ్చింది. మొదటగా 2 కూడళ్ల వద్ద.. గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీ కూడలిలో రూ.459 కోట్లతో రెండు ఫ్లైఓవర్లు, రెండు అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. అలాగే రూ.158 కోట్లతో విప్రో చౌరస్తాలో ఓ ఫ్లైఓవర్, ఐసీఐసీఐ చౌరస్తాలో అండర్‌పాస్ నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి కూడా పర్మిషన్ ఇచ్చింది.
హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌తో పాటు కొత్తగా ఫోర్త్ సిటీ నిర్మిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఆ దిశగా అడుగులు పడుతున్నాయి. ఫోర్త్ సిటీ విషయంపై ప్రభుత్వం ప్రత్యేక ఫోకస్ పెట్టింది. ప్రణాళికబద్ధమైన నగరంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే వివిధ రంగాల హబ్‌లను అక్కడ ఏర్పాటు చేసేందుకు ప్రతిష్టాత్మక సంస్థలతో ఇప్పటికే చర్చించారు. ఫార్మా రంగంతో పాటు, ఏఐసీటీ ఇతర టెక్నాలజీ సిటీలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# తెలంగాణ సంస్కృతితో సంబంధం లేకుండా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ తల్లిని నిర్మించింది

- మాజీ మంత్రి జగదీష్ రెడ్డి

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**

అంగరంగ వైభవంగా కాంగ్రెస్ నేతలు తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ విషయంపై తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి జగదీష్ రెడ్డి స్పందించారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు మరోసారి ప్రమాదం జరగబోతుందని, సినిమా పాటలతో ప్రజా విజయోత్సవ పాలన చేసుకున్నారని ఆయన అన్నారు. అయితే తాము సినిమా పాటలకు మేము వ్యతిరేకం కాదని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు లేకుండా ప్రజా విజయోత్సవ పాలన చేసుకున్నారని ఆయన అన్నారు. ఆనాడు సినిమా పాటల మత్తులో పడి, తెలంగాణ రాష్ట్రాన్ని ఆంధ్రప్రదేశ్ లో కలిపారని.. సినిమా పాటల మోజులో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ఆనాడే తుంగలో తొక్కారని కీలక వ్యాఖ్యలు చేసాడు.

తెలంగాణ సంస్కృతితో సంబంధం లేకుండా కాంగ్రెస్ పార్టీ తల్లినీ నిర్మించారని, ప్రజా విజయోత్సవాల్లో ముఖ్యమంత్రి, మంత్రులు ఒక్కరు అంటే ఒక్కరు కూడా 'జై తెలంగాణ' అనలేదని ఆయన అన్నారు. తెలంగాణ మేధావుల్లారా.. తెలంగాణ ద్రోహుల పక్కన చేరకండి.. మా హయంలో కాళోజీ, బండి యాదగిరి, చాకలి అయిలమ్మ, కొమరంభీమ్ , బంధగి , జయశంకర్ ఒక్కొక్కరిని స్మరించుకున్నామని ఆయనగుర్తు చేసారు. కాంగ్రెస్ పార్టీ స్వరూపం తెలిసే విధంగా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ తల్లినీ సచివాలయంలో పెట్టారని, జరుగుతున్న కుట్రలను తెలంగాణ వాదులు గమనించాలని ఆయన పేర్కొన్నారు.





## సిద్దిపేటలో శ్రీవారి ఆలయం..

**సిద్దిపేట, తెలంగాణ ముచ్చట్లు**

తెలుగు ప్రజలంతా కలియుగ ప్రత్యక్ష దైవంగా కొలిచే తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం.. త్వరలోనే సిద్దిపేట లో కొలువు దీరనుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు తెలిపారు. మంగళవారం తిరుపతి వెళ్లిన హరీశ్ రావు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడిని కలిశారు. సిద్దిపేట పట్టణంలోని కోమటి చెరువు ప్రాంతంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర దేవాలయ నిర్మాణం చేపట్టాలని కోరారు. వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం కోసం కోమటి చెరువు ప్రాంతంలో ఇప్పటికే.. 5 ఎకరాల 10 గుంటల స్థలాన్ని మంజూరు చేశామని టీటీడీ ఛైర్మన్‌తో హరీశ్‌రావు తెలిపారు. గతంలోనే టీటీడీకి చెందిన ఇంజనీరింగ్ అధికారులు కోమటి చెరువు ప్రాంతంలో పర్యటించి ఆలయ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారని బీఆర్ నాయుడికి తెలిపారు. అందులు అనుగుణంగానే ఆలయ నిర్మాణ నమునా, డిజైన్లను కూడా రూపొందించారని వివరించారు. తిరుపతి వెంకటేశ్వర స్వామిని తెలుగు ప్రజలంతా ఎంతో ఇష్టంగా కొలుస్తారని.. ఇలవేల్పుగా భావిస్తారని తెలిపారు. అలాంటి శ్రీవారి ఆలయం సిద్దిపేటలో నిర్మించడం గొప్ప అదృష్టమని హరీశ్‌రావు చెప్పుకొచ్చారు. వచ్చే టీటీడీ బోర్డు మీటింగ్‌లో సిద్దిపేటలో వెంకటేశ్వర దేవాలయ నిర్మాణానికి ఆమోదం తెలిపేలా చొరవ తీసుకోవాలని హరీష్ రావు విజ్ఞప్తి చేశారు. కాగా.. ఆలయ నిర్మాణ పనుల శంకుస్థాపనకు ముఖ్య అతిథిగా బీఆర్ నాయుడినే రావాల్సిందిగా హరీష్ రావు కోరారు. అందుకు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు సానుకూలంగా స్పందించారు. వెంటనే చీఫ్ ఇంజనీర్ అధికారి, సంబంధిత అధికారులను పిలిచి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

## నేనూ.. మీ తెలంగాణ తల్లిని మాట్లాడుతున్న తెలంగాణ తల్లి

**తెలంగాణ ముచ్చట్లు**

సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని రేవంత్ రెడ్డి సర్కార్ అట్టహాసంగా ఆవిష్కరించింది. తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా.. బహుజనుల తల్లిగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రభుత్వం రూపొందించిన విషయం తెలిసిందే. అయితే.. నిన్న ఆవిష్కరించారో లేదో.. తెలంగాణ బిడ్డలను ఉద్దేశించి ఈరోజు తెలంగాణ తల్లి మాట్లాడింది. అదేంటి.. తెలంగాణ తల్లి మాట్లాడటమేంటీ అనుకుంటున్నారా..? నిజమండీ బాబూ..!"నేనూ మీ తెలంగాణ తల్లిని.. ఎన్నో ఆత్మ బలిదానాల మధ్య నన్ను తెచ్చుకున్న నా బిడ్డలారా.. మీ అందరికీ నేను తోడుగా.. తెలంగాణ ముఖ చిత్ర రూపంలో నేను ఎప్పుడు మీ వెన్నంటే ఉండి మీకు ధైర్యాన్ని ఇస్తాను. తెలంగాణ ఎప్పుడు సశ్యశామలంగా కోటి రతనాలతో పచ్చని తోరణంలా కళకళలాడుతూ ఉండాలని నేను కోరుకుంటున్నాను. నా దీవెనలు మీకు ఎప్పటికీ ఉంటాయి." అంటూ తెలంగాణ తల్లి.. తెలంగాణ ప్రజలకు తన దీవెనలు.. విత్ ఎక్స్‌ప్రెషన్స్ అందించింది. ఏఐ టెక్నాలజీని ఉపయోగించుకుని.. నెటిజన్లు రకరకాల ఆసక్తికర వీడియోలు సృష్టిస్తున్నారు. ఫొటోల్లోని బొమ్మలతో కూడా మాట్లాడించేస్తున్నారు. కాగా.. ఇటీవల ఏఐ టెక్నాలజీని ఉపయోగించుకుని.. పలు మీడియా సంస్థలు కృత్రిమ న్యూస్ రీడర్లతో వార్తలు కూడా చదివేంచేస్తున్నారు. ఈ క్రమంలోనే.. తెలంగాణ తల్లితో కూడా మాట్లాడించేశారు కొందరు నెటిజన్లు. అందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.

ఈ వీడియోలో తెలంగాణ తల్లే నిజంగా మాట్లాడుతుందా అన్నట్టుగా.. వచ్చే మాటలకు అనుగుణంగా పెదాల కదలికలు, కనురెప్పలు వాల్చటం, మాటలకు అనుగుణంగా ముఖంలో హావాభావాలు అచ్చంగా తెలంగాణ తల్లే మాట్లాడినట్టుగా క్రియేట్ చేయటం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఈ వీడియో చూసి.. చాలా మంది ఫిదా అయిపోతున్నారు. ఈ విడియోపై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు.



## నోబెల్ శాంతి బహుమతి అందుకున్న నిహాన్ హిడాంక్యో సంస్థ

**తెలంగాణ ముచ్చట్లు**

2024 నోబెల్ శాంతి బహుమతిని అణ్వాయుధాలకు వ్యతిరేకంగా ప్రచారం చేసే నిహాన్ హిడాంక్యో సంస్థ అందుకుంది. నార్వేలోని ఓస్లోలో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ తరపున జపాన్‌పై జరిగిన అణుబాంబు దాడి నుంచి ప్రాణాలతో బయటపడిన ఆ సంస్థకు చెందిన ముగ్గురు సభ్యులు అందుకున్నారు. నిహాన్ హిడాంక్యోను ఏర్పాటు చేసిన టెరుమి తనకా, షిగెమిట్సు తనకా, తోషియుకి మిమాకి ధ్రువపత్రంతో పాటు గోల్ట్ మెడల్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా అన్వస్త్రాల ద్వారా పొంచి ఉన్న ముప్పుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అణ్వాయుధాలకు వ్యతిరేకంగా శాంతి, అణ్వస్త్రరహిత ప్రపంచం కోసం గళమెత్తిన నిహాన్ హిడాంక్యో సంస్థకు ఈ అక్టోబర్‌లో నోబెల్ శాంతి బహమతిని అవార్డు కమిటీ ప్రకటించింది.1945 ఆగస్టు 6న హిరోషిమాపై అగ్రరాజ్యం అమెరికా అణుబాంబు ప్రయోగించగా లక్షా 40 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. అదే నెల 9న నాగసాకిపై అమెరికా మరో బాంబు వేయగా 70వేల మంది బలయ్యారు. నాటి విధ్వంసంలో ప్రాణాలు దక్కించుకున్నవారిని హిబాకుషాగా అభివర్ణిస్తుంటారు. వీరు, పసిఫిక్ అణ్వస్త్ర పరీక్షల బాధితులు కలిసి 1956లో నిహాన్ హిడాంక్యోను ఏర్పాటు చేశారు.



## నీ గురువుకు పట్టిన గతే నీకూ పడుతుంది

- తెలంగాణ భవన్‌లోని తెలంగాణ తల్లికి పాలాభిషేకం

**హైదరాబాద్ తెలంగాణ ముచ్చట్లు**

సచివాలయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన తెలంగాణ తల్లి విగ్రహం నమూనాను తాము తిరస్కరిస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం రూపు మార్చడం దారుణమన్నారు. బతుకమ్మ తెలంగాణ ప్రత్యేక పండుగ అని, అలాంటి బతుకమ్మను తొలగించి హస్తం పార్టీ గుర్తును పెట్టడం దారుణమన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం నమూనాను వ్యతిరేకిస్తూ హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి కవిత పాలాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఉద్యమ తల్లే తమ తల్లి అని, హస్తం గుర్తు తల్లిని ఆమోదించేది లేదని స్పష్టం చేశారు. గ్రాండ్‌గా ఉండే తెలంగాణ తల్లిని తీసి... బీద తల్లిని పెట్టామని రేవంత్ రెడ్డి గొప్పలకు పోతున్నారని మండిపడ్డారు. తెలంగాణ మహిళలు ఎప్పటికీ పేదలుగానే ఉండాలా? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి పిట్ట బెదిరింపులకు తాము భయపడేది లేదన్నారు. విగ్రహం నమూనాను మార్చినందుకు నిరసనగా పాలాభిషేకం చేస్తున్నట్లు చెప్పారు.

ఉద్యమకారులంతా కలిసి ఏర్పాటు చేసుకున్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మార్చడం సరికాదన్నారు. జొన్నలు, మక్కలు ఇతర రాష్ట్రాల్లో కూడా పండుతాయని... కానీ పూలనే పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణది అన్నారు. అలాంటి బతుకమ్మను తెలంగాణ తల్లి నుంచి తొలగించారన్నారు. తెలంగాణ మహిళలు ఎప్పటికీ పేదలుగానే ఉండాలని పేద తల్లి విగ్రహం పెట్టారా? అని ఎద్దేవా చేశారు. విగ్రహం పెట్టామనే పేరుతో సామాన్యులకు ఇచ్చే హామీలను ఎగ్గొడతారా? అని నిలదీశారు. తొమ్మిది మంది కళాకారులను సన్మానిస్తున్నట్లు ప్రభుత్వం చెప్పిందని, మరి ఆ జాబితాలో మహిళలకు స్థానం ఎందుకు లేదో చెప్పాలన్నారు. ప్రభుత్వం ఉద్యమ ప్రతీకలను అవమానించడం..మార్చడం మానుకుని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంపై దృష్టి పెట్టాలన్నారు. మరోసారి తెలంగాణ తల్లి విగ్రహం జోలికి రావద్దని హెచ్చరించారు. తెలంగాణలో ఉద్యమకారుల జోలికి వస్తే ఏమవుతుందో మీ గురువు చంద్రబాబును అడిగి నేర్చుకోవాలని హితవు పలికారు.

## పెళ్లి పేరుతో చీటింగ్..

**హైదరాబాద్ తెలంగాణ ముచ్చట్లు**

ఆమెకు అప్పటికే పెళ్లై ఓ ఎనిమిదేళ్ల కుమారుడు ఉన్నారు. భర్తతో విభేదాల కారణంగా అతడికి దూరంగా ఉంటుంది. బతుకుదెరువు కోసం హైదరాబాద్ చేరుకొని సినిమాల్లో జూనియర్ ఆర్టిస్ట్‌గా పని చేస్తుంది. దీంతో ఆమెను ట్రాప్ చేసిన ఓ అసిస్టెంట్ డైరెక్టర్.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేశాడు. ఆ తర్వాత మరో అమ్మాయితో పెళ్లికి సిద్ధమయ్యాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించగా.. హైదరాబాద్ జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకకు చెందిన ఓ మహిళకు గతంలోనే పెళ్లి జరిగింది. ఆమెకు 8 ఏళ్ల వయస్సున్న కుమారుడు కూడా ఉన్నాడు. అయితే భర్తతో విభేదాల కారణంగా దూరంగా ఉంటున్నారు. కుమారుడితో కలిసి నగరానికి వచ్చిన ఆమె సినీ పరిశ్రమలో జూనియర్ ఆర్టిస్ట్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని కుమారుడిని పోషిస్తుంది. ఇదే సమయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న షేక్ గౌస్ మొయినుద్దీన్ అలియాస్ చిన్నతో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది. పెళ్లి చేసుకొని చూసుకుంటానని మాయమాటలు చెప్పిన మొయినుద్దీన్ ఆమెను నమ్మించాడు. గతేడాది ఫిబ్రవరిలో యూసుఫ్‌గూడ బస్తీ ప్రాంతంలో ఓ గది అద్దెకు తీసుకొని ఆమెతో సహజీవనం చేశాడు. డిసెంబరులో ఆమె గర్భిణి అని తెలిసింది. ఈ విషయాన్ని మొయినుద్దీన్ దృష్టికి తీసుకెళ్లగా.. ఇప్పుడే పిల్లలు వద్దంటూ బలవంతంగా అబార్షన్ చేయించాడు. తాజాగా గత నెలలో మొయినుద్దీన్ మరో యువతిని పెళ్లి చేసుకునేందుకు సిద్ధమయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న ఆమె ప్రశ్నించేందుకు వెళ్లగా ఆమెపై కుటుంబసభ్యులతో కలిసి దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు పోలీసులను, కోర్టును ఆశ్రయించారు. దీంతో కేసు నమోదు చేసుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు నిందితుడిపై బీఎన్ఎస్ యాక్ట్ 69, 89లతోపాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు బుక్ చేశారు.ప్రేమ పేరుతో మహిళలను, అమ్మాయిలను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు. కొత్త చట్టం ప్రకారం వారిపై తీవ్ర చర్యలు ఉంటాయని అంటున్నారు. మహిళలు కూడా గుడ్డిగా నమ్మి మోసపోవద్దని సూచిస్తున్నారు.



## కేసీఆర్.. నాలుగు స్తంభాలాట

- బీజేపీ ఎంపీ అర్వింద్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్ తెలంగాణ ముచ్చట్లు**

కేసీఆర్ తో కేటీఆర్, కవిత, హరీష్ రావు, సంతోష్ నాలుగు స్తంభాల ఆట ఆడుతున్నారని.. వీరి నలుగురి మధ్య కేసీఆర్ నలిగిపోతున్నారని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ స్టేట్ ఆఫీస్ లో మీడియాతో మాట్లాడారు. ఇచ్చిన హామీలు విస్మరిస్తే కేసీఆర్ కు పట్టిన గతే కాంగ్రెస్ కు పదుతుందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. అసెంబ్లీకి వెళ్లని కేసీఆర్ అపోజిషన్ లీడర్ ఎందుకు అయ్యారని నిలదీశారు. మైక్ ఇవ్వలేదని మొత్తుకుంటున్నా కేసీఆర్ ముందు అసెంబ్లీకి వెళ్ళి ఆ తర్వాత మైక్ గురించి మాట్లాడు అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం మీద బీఆర్ఎస్ రాజకీయం చేయడం దురదృష్టకరం అని ఈ పదేళ్లలో తెలంగాణ తల్లి విగ్రహం విషయంలో ఎందుకు జీవో తేలేదో కేటీఆర్ చెప్పాలన్నారు. బీఆర్ఎస్ కు తెలంగాణ తల్లి విగ్రహం మీద కమిట్మెంట్ లేదని ధ్వజమెత్తారు. కేసీఆర్ తెలంగాణనే దోచుకున్నారని కాళేశ్వరంతో ఒక్క ఎకరా పారలేదన్నారు. కేసీఆర్ ఓ వేస్ట్ ఫెల్లో అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. రేవంత్, కేసీఆర్ ఇద్దరూ దుర్మార్గులేనని దుయ్యబట్టారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై బీజేపీ నేత, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్, కవితలకు వచ్చే ఎన్నికల్లో కుక్క కూడా ఓటు వేయదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ ఇప్పుడు ఒక ఎమ్మెల్యే మాత్రమేనని గుర్తుంచుకోవాలని సూచించారు. తాను ఎప్పుడూ ఫైర్ బ్రాండ్‌నే అని మీడియా ప్రతినిధులు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. నా బండి నా చేతిలోనే ఉందని... సమయాన్ని బట్టి తాను గేర్ మారుస్తానని, అప్పుడే స్పీడ్ మారుతుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో తెలంగాణ తల్లి విగ్రహం పేరుతో పిచ్చి రాజకీయం చేస్తున్నారని దుయ్యబట్టారు.కేటీఆర్ ఎవరు? ఆఫ్టర్ ఎమ్మెల్యే మాత్రమే ఆయన గురించి ఏం క్వచ్చన్స్ అడుగుతారన్నారు. వాళ్ల పార్టీకి చెందిన 38 మంది ఎమ్మెల్యేలలో కేటీఆర్ ఒక్క ఎమ్మెల్యే మాత్రమేనని వర్క్ చేయనోడు కూడా వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యాడని సెటైర్ వేశారు. యాదగిరి గుట్ట మీద కేసీఆర్ ముక్కు , కారు గుర్తు చెక్కించుకున్నారని దయ్యబట్టారు. కవిత అక్టివ్ పాలిటికిస్ లోకి వస్తె ఏం చేయమంటారు? ఆమెను చూసి గజ గజ వణికిపోవాలా? అని ప్రశ్నించారు.

### పసుపుబోర్డుపై అవాస్తవాలు

పసుపు బోర్డు నిజామాబాద్ నుంచి మహారాష్ట్రకు తరలి వెళ్లిపోతుందని వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విమానాశ్రయాలపై మినిమం ధ్యాస పెట్టడం లేదని అర్వింద్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ నెగ్లిజెన్స్ వల్లే ఎయిర్ పోర్టు పనులు ఆలస్యం అవుతున్నాయన్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్ కు గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం శాంక్షన్ అయ్యిందని చెప్పారు. విమానాశ్రయం వచ్చే జక్రాన్ పల్లిలో కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్నారని గుర్తు చేశారు. తెలంగాణకు 7 నవోదయ విద్యాలయాలు కేటాయించిన ప్రధాని మోడీకి ధన్యవాదాలు చెప్పారు. ఇందులో 2 నిజామాబాద్ పార్లమెంట్ కి కేటాయించారని, తొందర్లోనే నిజామాబాద్ కు కేంద్రీయ విద్యాలయం సైతం రానుందన్నారు. ఇప్పటి వరకు కేవలం 25 శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. ముఖ్యమంత్రి క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. రేవంత్ ను ఇచ్చిన వాగ్దానాలను అడిగితే నడ్డాపై విమర్శలు చేస్తున్నారని హైదరాబాద్ ను నాశనం చేసి ఏ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని అనుకుంటున్నారు రేవంత్ రెడ్డి? అని ప్రశ్నించారు. దీని వెనకున్న కుట్ర ఏంటన్నారు. గుజరాత్ మోడల్ గురించి మాట్లాడే అర్హత రెండు పార్టీలకు లేదని హైడ్రా పేరుతో జేసీపీలతో బ్లాక్ మెయిల్ చేసి దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు.



## హిందువులపై హింసాత్మక దాడులు జరిగినమాట వాస్తవమే

**తెలంగాణ ముచ్చట్లు**

బంగ్లాదేశ్‌లో మైనారిటీలు, హిందువులపై దాడులు జరుగుతున్నట్లు ఎట్టకేలకు బంగ్లాదేశ్ అంగీకరించింది. వివిధ అంతర్జాతీయ నివేదికలు బంగ్లాదేశ్‌లోని హిందువులు, మైనారిటీలపై దాడులు జరుగుతున్నట్లు వెల్లడిస్తున్నా, ఇన్నాళ్లు నిమ్మకు నీరెత్తినట్లు ఊరుకున్న బంగ్లా ప్రభుత్వం తాజాగా కీలక ప్రకటన చేసింది. షేక్ హసీనా రాజీనామా చేసిన అనంతరం ఆగస్టు 5 నుంచి అక్టోబరు 22 మధ్యకాలంలో మైనారిటీలపై 88 మతపరమైన హింసాత్మక ఘటనలు జరిగినట్లు అంగీకరించింది. వీరిలో ముఖ్యంగా హిందువులకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నట్లు పేర్కొంది.

**కంటితుడుపు చర్యలు!**

మతపరమైన హింసాత్మక ఘటనల కేసుల్లో 70 మందిని అరెస్టు చేసినట్లు బంగ్లా తాత్కాలిక సారథి మహమ్మద్ యూనస్ ప్రెస్ కార్యదర్శి షఫీకుల్ ఆలమ్ వెల్లడించారు. ఇటీవలి కాలంలో మరిన్ని ఘటనలు, అరెస్టులు చోటుచేసుకున్న నేపథ్యంలో ఈ సంఖ్యమరింత పెరిగే అవకాశం ఉందని ఆయన అన్నారు. అక్టోబర్ 22 తర్వాత చోటుచేసుకున్న ఘటనలకు సంబంధించిన వివరాలు అన్నింటినీ త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

**భారత్ ఆందోళన**

హిందువులు, ఇతర మైనారిటీలపై జరుగుతున్న దాడులపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇదే విషయాన్ని భారత్ విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ బంగ్లాదేశ్‌కు తెలియజేశారు. ఢాకా వెళ్లిన ఆయన ఆ దేశ విదేశాంగ శాఖ కార్యదర్శి మహమ్మద్ జషీమ్ ఉద్దీన్‌తో డిసెంబర్ 9న సమావేశమయ్యారు. తాత్కాలిక ప్రభుత్వ సారథి మహమ్మద్ యూనస్‌తోనూ మిస్రీ భేటీ అయ్యారు. ఈ భేటీ మరుసటి రోజే దాడుల విషయాన్ని బంగ్లాదేశ్ అంగీకరించడం గమనార్హం.

## 11వందల మొబైల్ ఫోన్లు రికవరీ చేసిన సైబరాబాద్ పోలీసులు

**తెలంగాణ ముచ్చట్లు**

సైబరాబాద్ పరిధిలోని 45 పోలీసు స్టేషన్ల సిబ్బంది కష్టం వల్లే ఇదంతా సాధ్యమైందన్నారు. ఈ సంవత్సరం సైబరాబాద్‌లో 7500 మొబైల్స్ రికవరీ చేయడం జరిగిందన్నారు. ఫోన్ల రికవరీలో సైబరాబాద్ కమిషనరేట్ 2వ స్థానంలో వుందన్నారు. ప్రజలు విలువైన వస్తువులు తీసుకెళ్లేటప్పుడు జాగ్రత్త వహించాలని డీసీపీ సూచించారు. ప్రతి ఒక్కరు తమ ఇళ్లు, షాపులు, వ్యాపార సముదాయాల్లో సీసీటీవీలు అమర్చుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రతి కాలనీలో సీసీటీవీ ఏర్పాటు చేయడం వల్ల నేరాలు అరికట్టగలమని, ఒక్క సీసీటీవీ వంద మందితో సమానం అని అన్నారు.

# ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి

- అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా రూపొందించిన ముసాయిదా పోలింగ్ స్టేషన్ల జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 12వ తేదీలోపు తెలియజేయాలని హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి రాజకీయ పార్టీలను కోరారు.మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కలెక్టర్ పర్యవేక్షణలో ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా రూపొందించబడిందని తెలిపారు. ఈ నెల 7వ తేదీన అన్ని మండలాలు, గ్రామ పంచాయతీలలో ఈ జాబితాను ప్రకటించామని, జిల్లాలో 1986 పోలింగ్ కేంద్రాలను గుర్తించి ముసాయిదా జాబితాను తయారు చేశామని వివరించారు.

**అభ్యంతరాల నివేదన ప్రక్రియ:**

- ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 12వ తేదీలోపు, ఎంపీడీఓల ఆధ్వర్యంలో మండల స్థాయి సమావేశాలలో నివేదించవచ్చని వివరించారు.
- ఈ నెల 13న అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించనున్నట్లు చెప్పారు.
- తుది జాబితాను ఈ నెల 17న అన్ని మండలాలు, గ్రామ పంచాయతీలలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో డీపీఓ లక్ష్మి రమాకాంత్, కాంగ్రెస్ ప్రతినిధులు ఇ.వి. శ్రీనివాస్ రావు, బీజేపీ నుంచి నిశాంత్, ఎంఐఎం ఫైజుల్లా, వైఎస్సార్‌సీపీ రజినీకాంత్, టీడీపీ కుసుమ శ్యామ్ సుందర్, సీపీఎం వెంకట్ తదితర రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.





## మేఘన్న అభయ హస్తం ద్వారా బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

**వనపర్తి జిల్లా ప్రతినిధి, తెలంగాణ ముచ్చట్లు:**

వనపర్తి జిల్లా పెద్దమందడి మండల పరిధిలోని జగత్ పల్లి గ్రామంలో మేఘన్న అభయ హస్తం ద్వారా బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన ముష్టి నాగమ్మ భర్త కండెన్న, ఏర్పుల నాగరాజు తండ్రి గట్టన్న మృతి చెందడం జరిగింది. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గట్టు యాదవ్ ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి, అంత్యక్రియలు ఖర్చుల నిమిత్తం, ఇరువురు కుటుంబ సభ్యులకు 10000/ పదివేల రూపాయలు కాంగ్రెస్ నాయకుల ద్వారా అందజేశారు.బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని గట్టు యాదవ్ తెలిపారు.కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు చంద్రయ్య, రాములు, చంద్రయ్య నాగన్న, నరసింహా, బాలస్వామి పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఈవీఎం స్ట్రాంగ్ రూములను తనిఖీ కలెక్టర్ ప్రావీణ్య

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య మంగళవారం వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాముల్లో భద్రపరిచిన ఈవీఎంల స్ట్రాంగ్ రూములను తనిఖీ చేశారు. ఈ తనిఖీలు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా నిర్వహించారు.కలెక్టర్ పి. ప్రావిణ్య అధికారుల సమక్షంలో స్ట్రాంగ్ రూముల భద్రతా పరిస్థితులను, రికార్డుల నిర్వహణను, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. ఈవీఎంల భద్రతకు సంబంధించిన అన్ని అంశాలను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "ఈవీఎంల భద్రత చర్యలు పటిష్ఠంగా ఉండాలని, స్ట్రాంగ్ రూముల వద్ద నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణ కొనసాగాలని" అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఆర్డీవో రాథోడ్ రమేష్, అలాగే రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇ.వి. శ్రీనివాస్ రావు, శ్యాంసుందర్, సయ్యద్ ఫైజుల్లా, ఇతర అధికారులు పాల్గొన్నారు.





## సింగపురం ఇందిరను మర్యాద పూర్వకంగా కలిసిన బాలరాజు,శాగంటి మణి

**స్టేషన్ ఘనపూర్,తెలంగాణ ముచ్చట్లు:**

స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు, చిల్పూర్ మండల బీసీ సెల్ అధ్యక్షుడు బాలరాజు తన జన్మదినం సందర్భంగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇంచార్జ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిరను హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానం చేసి, పుష్పగుచ్చం అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి ఆమె ఆశీర్వాదం తీసుకున్నారు.

**శాగంటి మణికి శుభాకాంక్షలు తెలిపిన ఇందిరా**

ఇటీవల యువజన కాంగ్రెస్ చిల్పూర్ మండల ఉపాధ్యక్షులుగా ఎన్నికైన చిల్పూర్ మండలం ,నష్కల్ గ్రామానికి శాగంటి మణి కాంగ్రెస్ పార్టీ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇంచార్జ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిరను హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సింగపురం ఇందిరా మణికి శాలువా కప్పి సన్మానించి,శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో చిల్పూరు మండల యూత్ వైస్ ప్రెసిడెంట్ శాగంటి మణి, లింగంపల్లి గ్రామ వైస్ ప్రెసిడెంట్ కందుకూరి రాజు, యువనాయకులు జాని, పున్నంచందర్, సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





## కేంద్ర విమానయన శాఖ మంత్రిని కలిసిన ఎంపీ కడియం కావ్య

**న్యూఢిల్లీ,తెలంగాణ ముచ్చట్లు:**

మామునూరు విమానాశ్రయ పనులు త్వరితగతిన ప్రారంభం కావాలని కోరుతూ వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కేంద్ర పౌర విమానయన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆమె మామునూరు ఎయిర్పోర్ట్ అభివృద్ధి పై కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేశారు. విమానాశ్రయం పునరుద్ధరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అనేక చర్యలు చేపట్టిన విషయాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

**ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ....**

- హైదరాబాద్ తర్వాత అత్యంత ప్రాధాన్యమున్న వరంగల్‌ను రెండో రాజధానిగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ. 4,000 కోట్ల నిధులు మంజూరు చేసిన విషయాన్ని గుర్తుచేశారు.
- మాస్టర్ ప్లాన్, మెగా టెక్స్ టైల్ పార్కు భూసేకరణ, ఇళ్ల మంజూరు, అలాగే విమానాశ్రయం అభివృద్ధికి 205 కోట్లతో భూసేకరణ పూర్తి చేసినట్లు తెలిపారు.
- భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని, రెండు సంవత్సరాలలో ఎయిర్‌పోర్ట్ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు.

### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందన:

మామునూరు ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి పనులను వేగవంతం చేయడంపై సానుకూలంగా స్పందించిన మంత్రి, రెండు సంవత్సరాలలో విమానాల రాకపోకలు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఈ చర్చలకు సంబంధించిన వివరాలను వెల్లడిస్తూ ఎంపీ కడియం కావ్య, కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం మామునూరు ఎయిర్పోర్ట్ పునరుద్ధరణకు మరింత ఊతమివ్వనుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.



## సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన కొలిపాక సతీష్

**స్టేషన్ ఘనపూర్,తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రజల కోరికను నెరవేర్చినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంఘీభావంగా, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ కొలిపాక సతీష్ సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

**కొలిపాక సతీష్ విమర్శలు:**

- ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన తరువాత టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల అవసరాల కంటే తమ కుటుంబ ప్రయోజనాల కోసం పనిచేసిందని అన్నారు.
- కేసీఆర్ హయాంలో అనేక అవినీతి, ప్రజా నిధుల దుర్వినియోగం జరిగిందని, ప్రజలు వీరిపై విసుగెత్తారని అన్నారు.
- తెరాస ఇచ్చిన హామీలన్నీ పక్కదారి పట్టి, దళితులకు భూములు, ఇంటికొక ఉద్యోగం, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లాంటి హామీలు అమలు కాలేదని ఆరోపించారు.

**కాంగ్రెస్ విజయాలు:**

- కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తరువాత ఒకే ఏడాదిలోనే మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం, గ్యాస్ సిలిండర్ రూ. 500కు అందజేసి, రైతుల రుణమాఫీ చేయడం జరిగింది.
- విద్యా మరియు వైద్య రంగాలలో ఆర్టీసీ విద్యార్థులకు ఉచిత బస్సు పాస్, ఆరోగ్యశ్రీ పథకాన్ని 10 లక్షల రూపాయల వరకు పెంచడం వంటి చర్యలు తీసుకున్నామని తెలిపారు.
- రేషన్ కార్డుల పంపిణీతో పాటు ఇందిరమ్మ ఇళ్లను త్వరలో అర్హులైన వారికి అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

రాబోయే 9 సంవత్సరాలు తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోనే ఉండి పాలన కొనసాగుతుందని నమ్మకం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మేకల మల్లేశం, మామిడ్ల శ్రీనివాస్, గట్టు మనోహర్, యూనిస్ ఖాన్, సృజన్, రాహుల్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ చరిత్ర తెలవదు

- బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బండి రజనీ కుమార్

**హసన్ పర్తి,తెలంగాణ ముచ్చట్లు:**

కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అపచారానికి నిరసనగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు బండి రజనీ కుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి హసన్ పర్తి మండల కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ చరిత్ర తెలవదని తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిన సమయంలో రాష్ట్ర ప్రజలు తెలంగాణ తల్లిని ప్రజలంతా ఏకమై స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకోవడం జరిగిందని ప్రజలంతా ఏకమై తెలంగాణలోని ప్రతి పల్లెల్లో ఏర్పాటు చేసుకున్న తెలంగాణ తల్లిని మార్చినంత మాత్రాన ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు తెలుపరని అన్నారు. లక్ష్మీదేవి లాగా సకల ఆభరణాలతో ఉన్న తెలంగాణ తల్లిని పేద దానిని చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకు వచ్చిన తెలంగాణ తల్లి విగ్రహం తెలంగాణ సమాజాన్ని అవమానించే విధంగా ఉండడాన్ని నిరసిస్తూ హసన్‌పర్తి మండల కేంద్రంలో తెలంగాణ తల్లి ప్రతిమ కి పాలాభిషేకం చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కందుకూరి చంద్రమోహన్, సంఘాల విక్టరీ బాబు, చల్లా వెంకటేశ్వర రెడ్డి, 55 డివిజన్ అధ్యక్షుడు అటికం రవీందర్, నద్దునూరి నాగరాజు, సూరం వాసుదేవరెడ్డి, చెంచు విజేందర్, చెంచు రవి, జెట్టి రాజేందర్,మూల దేవేందర్,తోట నాగరాజు,గరిగే మురళి తదితరులు పాల్గొన్నారు.




## స్వచ్ఛత అనేది ఒక నిరంతర ప్రక్రియ

- స్వచ్ఛత ఆరోగ్యకరమైన జీవనానికి బాటలు వేస్తుంది
- డిఆర్డిఓ మేన శ్రీనివాస్

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం మరియు హ్యూమన్ రైట్ డే సందర్భంగా నవంబర్ 19 నుంచి డిసెంబర్ 10 వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా, హనుమకొండ డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మరుగుదొడ్ల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.మంగళవారం జరిగిన కార్యక్రమంలో 100% మరుగుదొడ్లను వినియోగిస్తున్న లబ్ధిదారులను గుర్తించి సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ మేన శ్రీను మాట్లాడుతూ, స్వచ్ఛత ఒక నిరంతర ప్రక్రియ అని, ప్రజలు మరుగుదొడ్లను పూర్తిగా వినియోగించడంతో పాటు తడి చెత్త, పొడి చెత్త విభజనపై అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు.ఆయన మాట్లాడుతూ, హనుమకొండ జిల్లాను స్వచ్ఛత వైపు ముందుకు తీసుకెళ్లడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. స్వచ్ఛత విషయంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, ఇది ఆరోగ్యకరమైన జీవనానికి బాటలు వేస్తుందని ఆయన వివరించారు.ఈ కార్యక్రమం ద్వారా స్వచ్ఛ భారత్ మిషన్ ముఖ్యతను ప్రజల్లోకి చొప్పించడం, మరుగుదొడ్ల వినియోగాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ, ఏఓ, కార్యాలయ సూపరింటెండెంట్‌లు స్వచ్ఛ భారత్ మిషన్ కన్సల్టెంట్లు,సిబ్బంది, లబ్ధిదారులు,తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

## హనుమకొండ జిల్లా
# సంప్రదింపుల కమిటీ సమావేశం




**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:**
హనుమకొండ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి అధ్యక్షతన జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశం జరిగింది. 202425 సంవత్సరానికి నిర్దేశించబడిన వార్షిక రుణ ప్రణాళిక ₹7413.22 కోట్లకు గాను, రెండవ త్రైమాసికంలో ₹3773.14 కోట్ల రుణమంజూరీ జరిగింది.ప్రాధాన్యతా రంగాల్లో వ్యవసాయానికి ₹2305.71 కోట్లు, పరిశ్రమలకు ₹1400.70 కోట్లు, విద్యారుణాలకు ₹16.03 కోట్లు, గృహనిర్మాణం కోసం ₹22.00 కోట్లు, ఇతర రంగాలకు ₹87.58 కోట్లు మంజూరీ అయ్యింది. ఇతర రంగాలకు ₹5081.27 కోట్ల రుణమంజూరీ జరిగింది.ప్రజలకు ఆర్థిక అవగాహన కల్పించే క్రమంలో "ఖాతాదారునకు చేరువ" వంటి కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. జీవన జ్యోతి భీమా యోజన కింద 110439 మందికి భీమా సౌకర్యం, సురక్ష భీమా యోజన ద్వారా 331587 మందికి భీమా అందించడం జరిగింది. అటల్ పెన్షన్ యోజన కింద 54523 మంది ఖాతాదారులకు పెన్షన్ సౌకర్యం కల్పించారు.అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ, కొన్ని బ్యాంకులు పంట రుణాలు ఇవ్వడంలో వెనుకబడ్డాయని, ఈ సంవత్సరం లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. అగ్రి ఇన్ఫ్రా ఫండ్, పీఎంఎఫ్ఎమ్ఇ, ఎఐఎఫ్, పొదుపు సంఘాలకు సోలార్ యూనిట్స్ కోసం రుణాలు అందించాలన్నారు. పరిశ్రమలకు రుణాలు మంజూరు చేయని బ్యాంకులను మందలించారు. పీఎంఈజీపీ, స్టాండ్ అప్ ఇండియా వంటి పథకాలపై బ్యాంకులు ఆలస్యం చేయకూడదని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, నాబార్డ్ ఏ.జి.ఎం. చంద్రశేఖర్, ఆర్.బి.ఐ అధికారి పల్లవి, డి.ఆర్.డీ.ఓ. శ్రీను, ఏపీజీవీబీ ఆర్.ఎం. చైతన్య మరియు ఇతర బ్యాంకు అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**వరంగల్,తెలంగాణ ముచ్చట్లు:**
కోర్టులో పెండింగులో ఉన్న కేసుల పరిష్కారం కోసం జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ నెల 14వ తేదీన డిసెంబర్ 14వ తేదీన జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అన్ని కోర్టు ప్రాంగణాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడుతుందని ఆయన ప్రకటించారు .ఈ లోక్ అదాలత్‌లో చట్టరీత్యా రాజీకి అర్హమైన క్రిమినల్ కేసులతో పాటు రాజీపడదగిన సివిల్ కేసులు, భూ వివాదాలు, వాహన ప్రమాద పరిహార కేసులు, చిట్ ఫండ్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, వైవాహిక కేసులు, తగాదాలు, ట్రాఫిక్ కేసులు తదితర అన్ని కేసులకు సంబంధించి సత్వర పరిష్కారాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు.ఇరువర్గాల కక్షిదారులు ఈ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో ఏ.ఎస్.పి మనాన్ భట్, అదనపు డిసిపి రవి, సిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్ రావు, శ్రీనివాస్, కరుణాకర్ పాల్గొన్నారు.



## కేంద్ర రైల్వే మంత్రి కి వినతి పత్రాన్ని సమర్పించిన వినయ్ భాస్కర్

**ఖాజీపేట్ తెలంగాణ ముచ్చట్లు**
ఢిల్లీలోని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కు మంగళవారం ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తో కలిసి మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ బృందం పలు డిమాండ్ లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కు దాస్యం వినయ్ భాస్కర్ శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల చిరకాల స్వప్నమని పేర్కొన్నారు. నాడు ఉద్యమ సమయంలో శ్రీకృష్ణ కమిటీకి కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని, నాటి ఉద్యమ నేత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాటి పార్లమెంటు సభ్యులు, మేము కలిసి విభజన చట్టంలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు, ట్రైబల్ యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని పొందుపరిచేలా కేంద్రంపై ఒత్తిడి చేసిన విషయాన్ని కేంద్ర మంత్రి కి ఆయన గుర్తు చేశారు. కాజీపేటకు రావలసిన కోచ్ ఫ్యాక్టరీ పలు రాష్ట్రాలకు తరలిపోయిన తీరును వివరించారు. వివిధ దశలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం కలిసి వచ్చే ఉద్యమ శక్తులతో కలిసి చేసిన పోరాటాన్ని కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు అవశ్యకతను వివరించారు. కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటునకు కావలసిన స్థలాన్ని సైతం కేసీఆర్ హయాంలోనే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి అప్పగించింది అన్న విషయాన్ని మంత్రికి గుర్తు చేశారు. అలాగే కాజీపేట రైల్వే జంక్షన్ ను డివిజన్స్ స్థాయికి త్వరితగతిన అప్డేట్ చేయాలని ఆయన కోరారు. రైల్వే స్టేషన్ లో కొన్ని రైళ్లు హాల్ట్ జరగాలని, ఫ్లాట్ ఫామ్ ల సంఖ్య పెంచాలని ఎక్కువ బడ్జెట్ కేటాయించాలని ఆయన విన్నవించారు. వరంగల్ లో రైల్వే స్టేడియంలో అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. 60 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని కాజీపేట ఐటిఐ కాలేజీ విద్యార్థులకు స్థానికంగా అప్రెంటిస్ కల్పించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. చిరు వ్యాపారులకు వెండింగ్ జోన్స్ కట్టించాలని, బోడ గుట్టకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలని డిమాండ్ చేశారు. నిర్మాణంలో ఉన్న వంతెన త్వరగా పూర్తయ్యాలా రైల్వే శాఖ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు రైల్వే సమన్వయం ఇతర సహకారం అందించాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సంకు నర్సింగ్ రావు , నార్లగిరి రమేష్, అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గబ్బెట శ్రీనివాస్ ,కొండ్ర శంకర్, దువ్వా కనకరాజు, బరిగెల వినయ్, సిరిమల్లె దశరథం, సుంచు అశోక్ ఎండి అఫ్జల్, ఎండి హుస్సేన్, రాబర్ట్ తదితరులు పాల్గొన్నారు.

## 1.5 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లిన దుండగులు

**ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:**
రూ.1.5 లక్షల విలువైన బంగారం,వెండి ఆభరణాలు గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లిన ఘటన మంగళవారం రాంపూర్ గ్రామంలో చోటుచేసుకుంది.పూర్తి వివరాల్లోకి వెళ్తే ..రాంపూర్ గ్రామానికి చెందిన ఆబోతు లక్ష్మి,ఆమె భర్త రాములు తమ ఇంటికి తాళం వేసి మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో కూలి పనికి వెళ్ళిపోయారు.సాయంత్రం ఐదు గంటల 30 నిమిషాలకు తిరిగి ఇంటికి వచ్చిన లక్ష్మి,ఇంటి తాళం పగలగొట్టి, మూడు తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు దొంగిలించబడ్డాయని గుర్తించారు.దొంగలించిన ఆభరణాల విలువ సుమారు రూ.1,50,000 లుగా ఉంటుందని సమాచారం.ఈ ఘటనపై ఆబోతు లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా,వారు వెంటనే కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.



## కర్ణాటక మాజీ సీఎం ఎస్.ఎం.కృష్ణ మృతి పట్ల మాజీ ఎంపీ నామ సంతాపం

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**
కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు ఎస్.ఎం.కృష్ణ మృతి పట్ల బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు విచారం వ్యక్తం చేస్తూ మంగళవారం ఒక సంతాప ప్రకటన విడుదల చేశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ, మంగళవారం తెల్లవారుజామున బెంగళూరులోని తన స్వగృహంలో ఎస్.ఎం.కృష్ణ తుదిశ్వాస విడిచారు. 15వ లోక్‌సభలో నామ టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేతగా ఉన్న సమయంలో ఎస్.ఎం.కృష్ణ విదేశాంగ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారని, నాడు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌కు సంబంధించిన పలు సమస్యల పరిష్కారానికి ఆయనతో చర్చించిన విషయాన్ని నామ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం చేసిన క్రమశిక్షణ గల నాయకుడిగా, ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, గవర్నర్‌గా వివిధ హోదాల్లో ఎస్.ఎం.కృష్ణ చేసిన సేవలు చిరస్మరణీయమైనవని ఆయన ప్రశంసించారు. ఎస్.ఎం.కృష్ణ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రజా సేవకు అంకితమై జీవితాంతం ప్రజల కోసం కృషి చేసిన వ్యక్తి ఎస్.ఎం.కృష్ణగారి మృతి రాజకీయ రంగానికి తీరని లోటు అని నామ పేర్కొన్నారు.



## పామాయిల్ సాగు ప్రోత్సాహానికి కేంద్రం తీసుకుంటున్న చర్యలేంటి..?

- సాంకేతిక నైపుణ్యాభివృద్ధికి తెలంగాణలో ఏమైనా కొత్త ప్రణాళికలు చేపట్టారా..?
- పార్లమెంట్ లో కోరిన ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**
పామాయిల్ పంట సాగు ప్రోత్సాహానికి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటోంది..? అని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి లోక్ సభలో ప్రశ్నించారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల సందర్భంగా.. ఎంపీ మాట్లాడుతూ..ముఖ్యంగా నీటి ఎద్దడి ఉన్న తెలంగాణ ప్రాంతంలో.. ప్రత్యేకంగా ఏమైనా కార్యక్రమాలు నిర్వహిస్తుందా..? అని లిఖిత పూర్వకంగా అడిగారు. దీనికి కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖల సహాయం మంత్రి భగీరథ్ చౌదరి సమాధానమిచ్చారు. పామాయిల్ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ ఆయిల్ పామ్ (ఎన్ ఎం ఈ ఓ ఓ పి) అనే కేంద్ర ప్రాయోజిత పథకాన్ని అమలు చేస్తోందని అన్నారు. 202122 నుంచి 202526 వరకు..మొత్తం రూ.11,040 కోట్ల వ్యయంతో ప్రణాళికను ఆమోదించినట్లు తెలిపారు.ఇంకా..సాగు విస్తరణ, ఉత్పత్తి, మార్కెట్ మద్దతు మరియు సాంకేతికత బదిలీ ద్వారా దేశంలో పామాయిల్ సాగును పెంచడానికి ఎన్ ఎం ఈ ఓ ఓ పి కృషి చేస్తున్నట్లు కేంద్ర సహాయ మంత్రి.. ఎంపీ రఘురాం రెడ్డికి వివరించారు. తద్వారా నీటిపారుదల, యాంత్రీకరణకు సహాయం చేస్తున్నట్లు, నూతన సాంకేతికత, రైతు శిక్షణ, మౌలిక సదుపాయాల అభివృద్ధిని కూడా ఈ పథకం ప్రోత్సహిస్తుందని అన్నారు.

### ప్రణాళికతో ప్రోత్సహిస్తున్నాం..

**ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ రీసెర్చ్ ప్రకారం.. ఆయిల్ ఫామ్ సాగు భూగర్భ జలాల లభ్యతను ప్రతికూలంగా ప్రభావితం చేయదని తేలిందని తెలిపారు. అరటి, చెరకు వంటి పంటలతో పోలిస్తే దీనికి తక్కువ నీరు అవసరమని కేంద్ర సహాయ మంత్రి చెప్పారు. బిందు సేద్యం మరియు నీటి హార్వెస్టింగ్ నిర్మాణాలతో పాటు ఆయిల్ పామ్ ప్లాంటేషన్‌ను ఎన్ ఎం ఈ ఓ- ఓ పి కింద ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణతో సహా అన్ని రాష్ట్రాల్లో సబ్సిడీ ఇస్తున్నామని, నీటి వినియోగానికి ప్రోత్సాహకాలు అందజేస్తున్నామని ఈ సందర్భంగా వివరించారు.**



## కరాటే పోటీల్లో సెయింట్ ఆంథోనీ విద్యార్థుల విశేష ప్రతిభ

**ధర్మసాగర్, తెలంగాణ ముచ్చట్లు:**
2024 ఇంటర్ స్టేట్ కరాటే ఛాంపియన్‌షిప్ కోసం మంగళవారం కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించబడిన కరాటే పోటీల్లో సెయింట్ ఆంథోనీ పాఠశాల విద్యార్థులు అపూర్వ ప్రతిభను కనబరిచారు. పాఠశాల నుంచి 29 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా, వీరిలో 7 మంది బంగారు పతకాలు, 12 మంది సిల్వర్ పతకాలు, 10 మంది బ్రాంజ్ పతకాలు సాధించారు. పాఠశాల శిక్షకులు, కరాటే కోచ్‌లు ఈ విజయాన్ని మరింత గొప్పదిగా చేయడం కోసం విద్యార్థులను మరింత మెరుగైన శిక్షణతో రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనడానికి సిద్ధం చేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ రాజారపు ప్రతాప్, కరస్పాండెంట్ ప్రభుదేవ్, డైరెక్టర్ అనూష, ప్రిన్సిపల్ వేల్పుల అశోక్, ఉపాధ్యాయులు ఈ విజయానికి సానుభూతి తెలుపుతూ విద్యార్థులను అభినందించారు.



## పాఠశాల దశలో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి

**ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:**
జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాలలో జరిగిన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశంలో నిట్ వరంగల్ విశ్రాంత ఆచార్యులు లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సమావేశానికి ఇన్చార్జి ధర్మ ప్రకాష్ అధ్యక్షత వహించారు. లక్ష్మారెడ్డి పాఠశాల విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాల్సిన అవసరం పై మాట్లాడుతూ, శాస్త్రీయ దృక్పథం అనేది విమర్శనాత్మక ఆలోచన, సమస్య పరిష్కారం ప్రోత్సహించే మనస్తత్వం అని తెలిపారు. నేటి వేగవంతమైన సాంకేతిక యుగంలో విద్యార్థులు శాస్త్రీయంగా ఆలోచించేలా ఉపాధ్యాయులు తమ బాధ్యతను నిర్వర్తించాలని ఆయన సూచించారు.
ఈ సందర్భంగా ధర్మసాగర్ మండల విద్యాధికారి డాక్టర్ రామ్ దాన్ మాట్లాడుతూ, పాఠశాల స్థాయిలో శాస్త్రీయ దృక్పథం అలవర్చుకుంటే, విద్యార్థులు తమ నిత్యజీవితంలో ఎదురయ్యే సంక్లిష్ట సమస్యల పరిష్కారాలను సృజనాత్మకంగా కనిపెట్టగలుగుతారని, దీంతో వారి భవిష్యత్తు మరింత మెరుగ్గా ఉంటుందన్నారు.ఈ సమావేశంలో ధర్మసాగర్ మండలంలోని వివిధ పాఠశాలల నుండి 38 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. శ్యాంసుందర్, రవీందర్, యమున శ్రీ మూడవ, నాల్గవ తరగతుల విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం, గణిత మోడల్ లెసన్స్ బోధించారు. ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, వాలియా తదితరులు పాల్గొన్నారు.





తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక

## ఆటో డ్రైవర్‌కు రూ.10 లక్షల జీవిత బీమా..
# కూతురి పెళ్లికి రూ.లక్ష సాయం..



**ఢిల్లీ తెలంగాణ ముచ్చట్లు**

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికలు జరగనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అధికార ఆప్ దూకుడు పెంచింది. అసెంబ్లీ ఎన్నికల కోసం ఇప్పటికే రెండు విడతల్లో మొత్తం 31 మంది అభ్యర్థులను కూడా ప్రకటించిన విషయం తెలిసిందే.ఇక ఆప్ అధినేత కేజ్రీవాల్ అన్ని వర్గాల ప్రజలను తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే సోమవారం సాయంత్రం ఢిల్లీలోని తన నివాసంలో ఆటో డ్రైవర్లకు తేనేటి విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఓ ఆటో డ్రైవర్ కేజ్రీని భోజనానికి ఇన్వైట్ చేశారు. ఆయన ఆహ్వానం మేరకు ఇవాళ ఓ ఆటో డ్రైవర్ ఇంట్లో కేజ్రీ లంచ్ చేశారు. తన సతీమణి సునీతతో కలిసి తన ఇంటికి వచ్చిన కేజ్రీవాల్‌కు ఆటో డ్రైవర్ కుటుంబం ఘనంగా స్వాగతం పలికింది. ఈ సందర్భంగా అక్కడ కేజ్రీ లంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు కేజ్రీవాల్ వరాల జల్లు కురిపించారు. ఆటో డ్రైవర్ల కోసం ఐదు హామీలు ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలోకి రాగానే ఆటో డ్రైవర్ కూతురి పెళ్లికి రూ. లక్ష సాయం ఇస్తామని తెలిపారు. అదే విధంగా ప్రతి దీపావళి, హోలీకి రూ.2,500, ఒక్కో ఆటోడ్రైవర్‌కు రూ.10 లక్షల జీవిత బీమా, రూ.5 లక్షల ప్రమాద బీమా కల్పిస్తామని వెల్లడించారు. ఆటో డ్రైవర్ల పిల్లల పోటీ పరీక్షలకు సంబంధించిన ఫీజులు ప్రభుత్వమే చెల్లిస్తుందని హామీ ఇచ్చారు.



# గురుకులాలకు రేవంత్ గ్రహణం

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు**

కేసీఆర్ నేతృత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నాణ్యమైన, ఉచిత విద్యను అందించాలనే లక్ష్యంతో గురుకులాలను వెయ్యికిపైగా పెంచింది. అంతేకాదు, మైనారిటీల కోసం 200కు పైగా గురుకులాలను స్థాపించి వర్గం విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషిచేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లో కొత్త పోస్టులను మంజూరుచేసి పటిష్ఠం చేసింది.గత పదేండ్లుగా గురుకులాల్లో చదివిన విద్యార్థులు ఇప్పుడు ఐఐటీయన్లుగా, డాక్టర్లుగా ఎదిగారు. ఉన్నత చదువుల కోసం, ఉద్యోగ రీత్యా చాలామంది విదేశాలకు వెళ్లడం కూడా మనకు అనుభవమే. గురుకుల విద్య కారణంగా అనేక కుటుంబా ల్లో మొదటితరం విద్యార్థులు పైలట్లుగా, సైనికాధికారులుగా రాణిస్తుండటం విశేషం. కేసీఆర్ దూరదృష్టే వారిని ఆ స్థాయికి చేర్చింది. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ లాంటి అణగారినవర్గాల కోసం 50కి పైగా డిగ్రీ కళాశాలలను నెలకొల్పిన కేసీఆర్ సర్కార్ వేల మందిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దింది. పేదలకు అందని ద్రాక్షగా ఉన్న న్యాయవిద్యను సైతం గత బీఆర్ఎస్ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. పేదలు న్యాయమూర్తులు అవ్వాలనే గొప్ప సంకల్పంతో కేసీఆర్ న్యాయ కళాశాలను ఏర్పాటు చేయటం దేశ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగిన విషయం.కేసీఆర్ హయాంలో గురుకులాల్లో అడ్మిషన్లకు ఎంతో డిమాండ్ ఉండేది. నాడు సంక్షేమ గురుకులాలు అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి గడించాయి. దశాబ్ద కాలంలో గురుకులాలు ఎంతో వైభవానికి నోచుకుని, ఎన్నో అద్భుతాలు సృష్టించాయి. ఇది గురుకులాలపై కేసీఆర్ వేసిన చెరగని ముద్ర.

కేసీఆర్ పాలనలో ఎవరెస్ట్ కన్నా ఉన్నత స్థితిలో ఉన్న గురుకులాలు నేడు అగాథంలోకి కూరుకుపోయాయి. సంబంధిత మంత్రులు లేకపోవడంతో వాటి ఆలనా పాలనా కరువైంది. అందుకే ఏడాదిలో దాదాపు 50 మంది విద్యార్థులు మరణించారు. ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి, అసమర్థతకు ఇది నిదర్శనం. వరుస మరణాలు ఇటు తల్లిదండ్రులను, అటు విద్యార్థులను కలచివేస్తున్నాయి. సహచరులు తనువు చాలిస్తుండటంతో విద్యార్థులు కూడా మానసికంగా కుంగిపోతున్నారు.గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు నిత్యకృత్యమైపోయాయి. రాష్ట్రంలో ఏదో ఒక పాఠశాలలో, హాస్టల్లో ఫుడ్ పాయిజన్ అవడం, విద్యార్థులు రోడ్డెక్కడం ఆనవాయితీగా మారింది. ఉస్మానియా, కాకతీయ హాస్టళ్లలోనూ ఇదే తంతు. ఈ సంఘటనలపై ప్రభుత్వ పెద్దలు ఇస్తున్న సమాధానాలు, చేస్తున్న ఆరోపణలు అసంబద్ధంగా ఉన్నాయి. ఈ విషయం తల్లిదండ్రులకు కూడా అర్థమవుతున్నది. అందుకే వారు 'గురుకులాలకు రేవం త్ గ్రహణం పట్టింద'ని వాపోతున్నారు.రాష్ట్రంలోని మంత్రులు, ఎమ్మెల్యేలు తమ పర్యటనల్లో భాగంగా పాఠశాలలు, హాస్టళ్లలో శుభ్రత పాటించకపోవడాన్ని గుర్తించి, అక్కడి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేయడాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. 'ఆడ లేక మద్దెల ఓడు' అన్నట్టు తమ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి బీఆర్ఎస్ పార్టీని, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను నిందించడం నిర్హేతుకం. ఇది విద్వేషంతో కూడి విష ప్రచారమే.ఇప్పటికైనా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వాస్తవాలను గుర్తించాలి. క్షేత్రస్థాయిలో జరుగుతున్న తప్పులను తెలుసుకొని వాటిని సరిదిద్దాలి. గత కేసీఆర్ ప్రభుత్వంపై విద్వేషపూరిత ప్రసంగాలు, విష ప్రచారాలను మానుకొని, గురుకులాల్లో దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. గత ప్రభుత్వ హయాంలో పేరు ప్రఖ్యాతులు గడించిన గురుకులాలను మరింత బలోపేతం చేయాలి. 400 మంది విద్యార్థులున్న పాఠశాలల్లో ఇన్ని సమస్యలు వస్తుంటే ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పేరిట ఒకేచోట 2,500 మంది విద్యార్థులకు మూడు పూటలా ఆరోగ్యకరమైన భోజనం అందించడం ఎంత కష్టమో గుర్తెరగాలి. గత ప్రభుత్వంపై అక్కసుతో గురుకుల విద్యను నీరుగారుస్తూ ఆర్భాటంగా మొదలుపెడుతున్న సమీకృత గురుకుల పాఠశాలలు మరిన్ని సమస్యలకు నిలయాలుగా మారుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. కాబట్టి, వాటిపై కోట్ల రూపాయలు వెచ్చించడం కన్నా, ఉన్న గురుకులాలను బాగు చేసుకోవడమే మంచిది. ఆ సొమ్ముతో మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన, ఉచిత విద్యను బడుగు బలహీనవర్గాల విద్యార్థులకు అందించవచ్చు. తద్వారా గురుకులాలకు పూర్వ వైభవం సంతరించుకుంటుంది.



## కర్ణాటక మాజీ
# సీఎం ఎస్ఎం కృష్ణ కన్నుమూత

**తెలంగాణ ముచ్చట్లు**

కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి ఎస్ఎం కృష్ణ (92) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం తెల్లవారుజామున బెంగళూరులోని సదాశివనగర్‌లో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన స్వగ్రామం మద్దూరులోని సోమనహళ్లిలో బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎం కృష్ణ మృతి నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం 3 రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది. పూర్తి అధికారిక లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిపింది.

### ప్రధాని మోదీ సంతాపం

ఎస్ఎం కృష్ణ మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం తెలిపారు. 'కృష్ణ ఒక అద్భుమైన నేత. అన్ని వర్గాల ప్రజల నుంచి అభిమానాన్ని అందుకున్నారు. తన జీవితాంతం ఇతరుల కోసం పాటు పడ్డారు. కర్ణాటక సీఎంగా అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుంటాయి. ప్రత్యేకంగా మౌలిక సదుపాయల కల్పనపై ఆయన ఎక్కువ దృష్టి సారించారు. ఎస్ఎం కృష్ణలో గొప్ప పాఠకుడు, ఆలోచనాపరుడు ఉన్నారు' అని ఎక్స్ వేదికగా తెలిపారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడుతో పాటు పలువురు నేతలు ఎస్ఎం కృష్ణ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



# రేవంత్ రెడ్డి తెలంగాణ ద్రోహి

- తెలంగాణ ఉద్యమంలో ఎక్కడ పాల్గొన్నావు
- తెలంగాణ తల్లి విగ్రహాన్ని తాకే అర్హత లేదు

**పాలకుర్తి, తెలంగాణ ముచ్చట్లు**

రాష్ట్ర సచివాలయం ముందు కాంగ్రెస్ తల్లి విగ్రహ ఏర్పాటును నిరసిస్తూ పాలకుర్తి మండల కేంద్రంలోని ధర్ధపల్లి గ్రామంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అనంతరం సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి, బిఆర్ఎస్ నేత ఎర్రబెల్లి దయాకర్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.రేవంత్ రెడ్డి తెలంగాణ ద్రోహితెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నట్టు ఒక్క సాక్ష్యం చూపెట్టు నీళ్ల కోసం బాబ్లీ పోరాటం చేస్తుంటే, తప్పించుకుని పారిపోయారు.తెలంగాణ సాధన కోసం ఎక్కడైనా అరెస్ట్ అయ్యావా, శ్రీకాంతచారి ఆత్మార్పణం చేసుకుంటే ఆ కుటుంబాన్ని పలకరించావా తెలంగాణ విగ్రహం పెట్టే అధికారం నీకు ఎక్కడిది ఉంది.కెసిఆర్ ఉద్యమకారులతో రూపకల్పన చేసి తెలంగాణ తల్లి విగ్రహం పెట్టించాడు. తెలంగాణ విగ్రహం దేవత వలె ఉండాలి కానీ బతుకమ్మను తీసివేసి కాంగ్రెస్ పార్టీ చేయి గుర్తుపట్టారు. తెలంగాణ ప్రజలను సంస్కృతిని మోసం చేసిన ద్రోహి నీవు మొదటీ నుండి రేవంత్ రెడ్డి ఒక బ్లాక్ మేయిలర్ అవినీతి పరుడు ప్రజలకు ఇచ్చిన హామీలు 6 గ్యారంటీలు ఎక్కడ అమలు చేశారు. ఆసరాపింఛన్ పెంపు లేదు, తులం బంగారం, మహిళలకు రూ 2500, కూలీలకు రూ 12వేల హామీలు విస్మరించారు. కెసిఆర్ ప్రభుత్వంలోనే 30వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తే సర్టిఫికెట్ లు ఇస్తూ ఫోజులిస్తున్నారు. తెలంగాణ ప్రజలు చైతన్యవంతులు తెలంగాణ సాధన కోసం ఉద్యమం ఎలా చేశారో కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి మంత్రులను ఉరికించే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు ఆశ వర్కర్లకు రూ 18వేల వేతనం ఇస్తానని మోసం చేసి గ్రామ పంచాయతీలకు పెండింగ్ బిల్లులు సంవత్సరం కాలంగా చెల్లించడం లేదు.సిగ్గు లేకుండా ఉత్సవాలు చేస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. సిఎం రేవంత్ రెడ్డి తప్పును ప్రజల ముందు ఒప్పుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# దేవాదాయశాఖ
# భూముల సర్వే

**చిట్యాల, తెలంగాణ ముచ్చట్లు**

చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో శ్రీతిరుమలనాథస్వామి దేవాలయానికి సంబంధించిన భూములను మంగళవారం అధికారులు సర్వే చేయించారు. తాము నిర్వహించిన పెద్దకాపర్తి శివారులోని దేవాదాయశాఖ భూములను డిజిటల్ సర్వే చేశామని, ఆ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని దేవాదాయశాఖ డివిజన అధికారి సుమతి, సర్వేయర్ రజనీకాంత తెలిపారు. దేవాలయం, దేవాదాయశాఖకు చెందిన భూములను సర్వే చేపట్టామని భూములు ఎలాంటి కబ్జాలకు గురికాకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఆక్రమణలు చేపడితే నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలతో పాటు కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఈవో అంబటి నాగిరెడ్డి, పొట్లపల్లి చిన్నస్వామి, చేకూరి గణేష్, పొట్లపల్లి నర్సింహ, మాచర్ల యాదగిరి, ఏర్పుల దామోదర్, ఏర్పుల యాదయ్య, మోర రాములు రైతులు తదితరులు పాల్గొన్నారు.



# బస్సు బ్రేక్స్ ఫెయిల్! ఆరుగురు మృతి

**ముంబాయి తెలంగాణ ముచ్చట్లు**

మహారాష్ట్రలోని ముంబయి మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన బెస్ట్ బస్సు పాదచారులపైకి దూసుకెళ్లిన ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 43 మంది గాయపడినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం సోమవారం రాత్రి కుర్లా నుంచి అంధేరికి బెస్ట్ బస్సు వెళ్తుండగా బుద్ద కాలనీ వద్ద బ్రేకులు విఫలమై పాదచారులు, కొన్ని వాహనాలపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, చికిత్స పొందుతూ మరో ముగ్గురు . సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగ్రాతులను ఆస్పత్రికి తరలించారు. అనంతరం డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు తెలిపారు. బ్రేక్ ఫెయిల్ అవ్వడం వల్లే బస్సు ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు. 43 మంది క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. బస్సు ఢీకొట్టడం వల్ల అనేక వాహనాలు దెబ్బతిన్నాయి. బస్సును అతివేగంతో నడిపినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు దెబ్బతిన్న వాహనాలను తొలిగించే పనులు చేపట్టారు.



## తెలంగాణ తల్లి
# విగ్రహరూపం మార్చడం సరికాదు

**చేవెళ్ల తెలంగాణ ముచ్చట్లు**

తెలంగాణ తల్లి విగ్రహాన్ని మా ర్చడం సీఎం రేవంత్ రెడ్డి మూర్ఖత్వానికి బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్ అన్నారు. మంగళవారం చేవెళ్లలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాల వేసి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దోళ్ల ప్రభాకర్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ప్రజల తలరాతలు మారుస్తానన్న రేవంత్ రెడ్డి ఇప్పుడు తెలంగాణ తల్లి విగ్రహరూపం మార్చారన్నారు. తెలంగాణ తల్లి వెనుకబడ్డ విగ్రహం మార్పు పేరుతో తెలంగాణ చరిత్ర, అస్థిత్వంపై సీఎం దాడి చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ తల్లి దేవత మూర్తి కిరీటం లేకుండా ఉంటుందా? అని ప్రశ్నించారు. తెలంగాణ అస్తిత్వ చిహ్నం మన్నారు. తెలంగాణ చారిత్ర సాంస్కృతిక వారసత్వంపై సోయి లేని కాంగ్రెస్ ప్రభుత్వం పిచ్చి పిచ్చిగా వ్యవహరిస్తుందన్నారు. హైదరాబాద్ సెక్రటేరియట్ ఆవరణలో పెట్టింది తెలంగాణ తల్లి విగ్రహం కాదని.. అది కాంగ్రెస్ పార్టీ తల్లి విగ్రహం అని మండిపడ్డారు. కేసీఆర్ పై ద్వేషం, అసూయతో తెలంగాణ అస్థిత్వాన్ని దెబ్బతీయాలని చూస్తే చరిత్ర క్షమించదన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం బాధాకరమైన విషయమని, అక్రమ అరెస్టులు పథకాల పేర్లు మార్పు తప్ప కాంగ్రెస్ చేసిందేమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యూత్ నియోజకవర్గ అధ్యక్షులు వంగ శ్రీధర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ చారి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు శేరి రాజు, విగ్నేష్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నర్సింలు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు వెంకటేష్, ఫయాజ్, బిఆర్ఎస్వి నియోజకవర్గ అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, ముడిమ్యాల మాజీ ఉపసర్పంచ్ షేక్ అరిఫ్ మియా, కృష్ణ, అనుబాయ్, ఎల్లన్న, శ్రీనివాస్ రెడ్డి, పృధ్వి, వెంకట్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.




# శబ్దం వద్దు నిబంధనలు ముద్దు

- సైలెన్సర్లు మార్పు చేస్తే క్రిమినల్ చర్యలు
- ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలి
- ట్రాఫిక్ ఏసిపి సత్యనారాయణ

**వరంగల్ తెలంగాణ ముచ్చట్లు:**

ద్విచక్ర వాహనదారులు వివిధ కంపెనీల వాహనాలతో వచ్చిన సైలెన్సర్లను ఎలాంటి మార్పు చేసిన వాహనదారుడితో పాటు మార్పు చేసిన మెకానిక్ లపై కూడా క్రిమినల్ చర్యలు తీసుకోబడుతాయని వరంగల్ కమిషనరేట్ ట్రాఫిక్ ఏసిపి సత్యనారాయణ హెచ్చరించారు. మంగళవారం ట్రాఫిక్ పోలీసులు బుధవారం అదాలత్ జంక్షన్ వద్ద అధిక శబ్ధం చేసే ద్విచక్రవాహన సైలెన్సర్లను రోడ్ రోలర్‌తో ధ్వంసం చేసారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అదేశాల మేరకు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాల కంపెనీ సైలెన్సర్ల స్థానంలో అధిక శబ్దం వచ్చే సైలెన్సర్ల తో శబ్ద కాలుష్యాన్ని పెంచి ప్రజలకు ఇబ్బందులు కలిగే విధంగా ద్విచక్ర వాహనాలకు అమర్చిన సైలెన్సర్ల పై ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఇందులో భాగంగా గత కొద్ది రోజులుగా ట్రై సిటీ పరిధిలో నిర్వహించిన ప్రత్యేక తనీఖీల్లో నిబంధనలు విరుద్ధంగా అధిక శబ్ధం వచ్చే సైలెన్సర్లు ఏర్పాటు చేసిన ద్విచక్రవాహనాలను గుర్తించి వాటి నుండి మార్పు చేసిన సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీసులు తొలగించడం తోపాటు సైలెన్సర్లను మరోమారు వినియోగించకుండా రోడ్ రోలర్ సాయంతో దాదాపు 263కు పైగా సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీసులు ధ్వంసం చేయించారు. ధ్వంసం చేసిన సైలెన్సర్లలో హనుమకొండకు చెందినవి 120 కాగా కాజీపేట 82 వరంగల్ 61 ఉన్నాయి. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసిపి టి సత్యనారాయణ మాట్లాడుతూ సిపి అదేశాల మేరకు నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను మార్పు చేయడం చట్టరిత్యా నేరమని, శబ్ద కాలుష్య నియంత్రణతో పాటు ప్రజాఆరోగ్యాన్ని దృష్టిలో వుంచుకోని అధికంగా శబ్దం చేసే ద్విచక్రవాహనలపై ప్రత్యేక దృష్టి సారించి తనీఖీలు చేపట్టడం జరిగిందన్నారు. వాహదారులు కంపెనీతో వచ్చిన సైలెన్సర్లను మాత్రమే వినియోగించుకోవాలని ఎవరైన వాహనదారుడు సైలెన్సర్ మార్పు చేసే వారిపై పోలీసులు తీసులు క్రిమినల్ చర్యలు తీసుకోబడటంతో పాటు అట్టి వాహనదారులకు ఆర్టీఐ ద్వారా 03 నెలలు లైసెన్సు రద్దు చేయడంతో పాటు వాహనాన్ని సీజ్ చేయడం జరుగుతుందని అలాగే తమ మెకానిక్‌లు కూడా ఎట్టి పరిస్థితిలో ద్విచక్రవాహనాలకు సైలెన్సర్ల మార్పుకు ప్రోత్సహించవద్దని, ఇకపైన సైలెన్సర్ల మార్పుకు సహకరించిన మెకానిక్‌లపై కూడా క్రిమినల్ చర్యలు తీసుకోబడుతాయని. ఏసిపి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు నాగబాబు.. రామకృష్ణ , సీతారెడ్డి, , ఎస్.ఐలు క్రాంతికుమార్, రామారావు తో పాటు ట్రాఫిక్ సిబ్బంది పాల్గోన్నారు.



# గేమ్ ఛేంజర్

గేమ్ ఛేంజర్' నానా హైరానా సాంగ్ యూట్యూబ్‌లో రికార్డ్ వ్యూస్‌తో దూసుకెళ్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే 47 మిలియన్ వ్యూస్‌కు (తెలుగు, తమిళ్, హిందీ) దక్కించుకుంది. మెలోడీ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచింది. రామ్ చరణ్ కూడా షూటింగ్‌కు సంబంధించిన పలు దృశ్యాలను సోషల్ మీడియా వేదికగా తన ఫ్యాన్స్‌తో షేర్ చేసుకున్నారు. అయితే తాజాగా ఈ సాంగ్ చిత్రీకరణకు సంబంధించిన విశేషాలు తెలిశాయి. ఈ సాంగ్ న్యూజిలాండ్‌లో 6 రోజుల పాటు షూటింగ్ జరుపుకుంది. ఈ పాట కోసం ఇన్‌ఫ్రారెడ్ కెమెరాను ఉపయోగించారు. దాదాపు రూ.10 కోట్ల బడ్జెట్‌తో ఈ సాంగ్‌ను ప్రత్యేకంగా చిత్రీకరించారని తెలిసింది. తమన్ సంగీతం అందించారు. తిరు ఛాయాగ్రాహకుడిగా వ్యవహరించారు. ఆలిమ్ హకీమ్, రామ్ చరణ్‌కు ప్రత్యేకంగా హెయిర్ స్టైల్ తీర్చిదిద్దారు. మనీష్ మల్హోత్ర ఫ్యాషన్ డిజైనర్‌గా వర్క్ చేశారు. తెలుగులో రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. కార్తిక్, శ్రేయా ఘోషల్ గీతాన్ని ఆలపించారు.కాగా, సినిమాలో రామ్ చరణ్ ద్విపాత్రాభినయం చేశారు. దర్శకుడు శంకర్ పొలిటికల్ యాక్షన్ డ్రామాగా దీన్ని తీర్చిదిద్దారు. కియారా అద్వాణీ హీరోయిన్‌గా నటించింది. శ్రీకాంత్, అంజలి, నవీన్‌చంద్ర, ఎస్. జె. సూర్య తదితరులు కీలక పాత్రల్లో నటించారు.2025 సంక్రాంతిని పురస్కరించుకుని జనవరి 10న సినిమాను రిలీజ్ చేస్తున్నారు. ఫారెన్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ జరుపుకోనున్న మొదటి ఇండియన్ సినిమాగా గేమ్ ఛేంజర్ నిలవనుంది. యు.ఎస్.ఎ. (కర్టిస్ కల్‌వెల్ సెంటర్, 4999 నామన్ ఫారెస్ట్, టెక్సాస్)లో ఈ నెల 21 ఈవెంట్‌ను నిర్వహించనున్నట్టు మూవీ టీమ్ కొద్ది రోజుల క్రితం ప్రకటించింది. రీసెంట్‌గా తన పాత్రకు ఎస్ జే సూర్య డబ్బింగ్ పూర్తి చేశారు. బొమ్మ అదిరిపోయింది అంటూ ఫ్యాన్స్‌లో ఆసక్తి రేకెత్తించారు.



# లెగ్స్ అందాలతో మాయ చేస్తూ..

ఇనయా సుల్తానా తాజా ఫోటోషూట్ హాట్ టాపిక్‌గా మారింది. గ్లామర్‌తో కుర్ర హృదయాలను ఆకర్షించే ఈ బిగ్ బాస్ కంటెస్టెంట్ తాజాగా షేర్ చేసిన లావెండర్ కలర్ డ్రెస్‌లోని ఫోటోలు సోషల్ మీడియాలో సందడి చేస్తున్నాయి. స్లిక్ బ్రెయిడెడ్ హెయిర్ స్టైల్, తన యూనిక్ స్టైల్ ఆఫ్ ప్రెజెంటేషన్‌తో మాయ చేస్తోంది. ఈ ఫోటోల్లో ఆమె ధరించిన కాస్ట్యూమ్స్ ట్రెడిషనల్‌గా ఉండకపోయినా, మోడర్న్ లుక్‌తో గ్లామర్ తో సో క్యూట్ అనిపించింది. బాడీ హగ్గింగ్ డ్రెస్ ఆమె అందాలను హైలైట్ చేస్తుండగా, అందమైన పోజులు మరో లెవెల్‌లో ఆమె అందాన్ని హైలెట్ చేశాయి. ముఖ్యంగా లావెండర్ షేడ్ ఆమె స్కిన్ టోన్‌తో చాలా హైలైట్ అయింది. ఇనయా "నా వెర్షన్‌ను అప్డేట్ చేసుకున్నాను" అంటూ చేసిన పోస్ట్ ట్రెండ్ అవుతోంది. ఈ మేకోవర్‌ను ఫ్యాషన్ ప్రియులు పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. మొండిగా..మూర్ఖంగా బన్నీ..అందుకే ఆ స్థానం! ఆమె స్టైలింగ్ టీమ్ పనితనాన్ని స్పష్టంగా చెప్పడానికి ఈ ఫోటోలు నిదర్శనం. స్పెషల్ గా హైలైట్ అయిన డ్రెస్, కౌల్డ్ బ్రేవ్స్‌తో ఫోటోషూట్ ఎక్కడా బోరింగ్ అనిపించకుండా ఉంది. తాజాగా ఆమె వ్యక్తిగత జీవితం గురించిన వార్తలతో పాటు ఈ ఫోటోషూట్ ఇనయాను మరింతగా నెట్టింట ట్రెండ్ చేసాయి. ఆమె గ్లామర్ మంత్రంతో ఫ్యాన్స్‌ను కొత్తగా ఆకర్షిస్తూ, కొత్త హైప్ క్రియేట్ చేసింది. ఇక ఇనయా సుల్తానా సోషల్ మీడియాలో ఇలా గ్లామర్ తోనే ఈమధ్య ఎక్కువగా వైరల్ అవుతోంది. అలాగే అమ్మడు అప్పడప్పడు తన బాయ్ ఫ్రెండ్ తో ట్రిప్స్ కి వెళుతూ గ్లామర్ ఫాటోలతో కనిపిస్తూ ఉంటుంది. ఎలాంటి ఫాటో పోస్ట్ చేసినా కూడా ఇట్టే వైరల్ అవుతుంటాయి. ఇక ఇనయా తన కెరీర్ లో బిజీ అవ్వాలని అనుకుంటోంది. మంచి కంటెంట్ ఉన్న గ్లామర్ రోల్స్ చేసేందుకు కూడా సిద్ధమే అన్నట్లు ఈ విధంగా ఫాటో ఘూట్ చేస్తోంది.

## sports స్పోర్ట్స్



# టోర్నీ గెలుస్తానని రోహిత్ మాటిచ్చాడు

ఏ ఆటగాడైనా తాను ఎంచుకున్న రంగంలో రాణించాలంటే కోచ్‌ది కీలత పాత్ర. అందులోనూ చిన్ననాటి కోచ్ మరింత కీలకం. అలా టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ కెరీర్ విజయవంతం అవ్వడంలో తన చిన్ననాటి కోచ్ దినేశ్ లడ్ పాత్ర అమోఘం. 2000వ సంవత్సరంలోనే రోహిత్‌లోని ప్రతిభను గుర్తించిన లడ్, తనను అత్యుత్తమంగా తీర్చిదిద్దాడు.

ఆ తర్వాత 2007లో టీమ్‌ఇండియా అరంగేట్రం చేసిన హిట్‌మ్యాన్ అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం కెప్టెన్‌గా కొనసాగుతున్నాడు. అయితే తన కెరీర్ ప్రారంభ రోజుల్లో ముఖ్య పాత్ర పోషించిన దినేశ్‌కు హిట్‌మ్యాన్ ఓ ప్రామిస్ చేశాడట. చేయడమే కాదు అది నిలబెట్టుకున్నాడు కూడా. ఈ విషయం తన కోచ్ దినేశ్ లడ్ రీసెంట్‌గా ఓ సందర్భంలో చెప్పాడు.

'2023 వన్డే వరల్డ్ కప్ ఓటమి తర్వాత రోహిత్‌ను కలిశా. ఫైనల్‌లో మనం బాగా ఆడలేదు. ముఖ్యంగా నువ్వు ఔటైన తీరు, మ్యాచ్‌పై ప్రభావం చూపింది. ఆ టైమ్‌లో నీ వికెట్ పడకుండా ఉండుంటే పరిస్థితి ఇంకోలా ఉండేదేమో! కానీ, మొత్తం సిరీస్‌లో నువ్వు చాలా పాజిటివ్‌గా, జట్టు కోసం అద్భుతంగా ఆడావు' అని రోహిత్‌తో చెప్పాను.

అప్పుడు రోహత్ తనకు ప్రామిస్ చేశాడట. టీ20 ప్రపంచకప్ నెగ్గి, ఆ విజయాన్ని తనకు 'గురు దక్షిణ'గా ఇస్తానని చెప్పినట్లు కోచ్ దినేశ్ తెలిపాడు. 'టీ20 వరల్డ్ కప్ గెలుస్తామని రోహిత్ నాకు మాటిచ్చాడు. 'సర్, ప్రపంచకప్ గెలిచి మీకు గురు దక్షిణగా ఇస్తాను' అని అన్నాడు. ఫైనల్ మ్యాచ్ గెలిచిన తర్వాత నాకు ఫోన్ చేసి 'మీ ఫీజు (ట్రోఫీ) తీసుకొస్తున్నాను' అన్నాడు' అని వాళ్లిద్దరి మధ్య జరిగిన సంభాషణ గురించి చెప్పాడు.

**నాకేం ఆశ్చర్యం అనిపించలేదు**

రోహిత్ శర్మ నాయకత్వంపై దినేశ్ ప్రశంసలు కురిపించాడు. అతడి కెప్టెన్సీలో భారత్ కప్పు నెగ్గడం తనకేమీ ఆశ్చర్యం అనిపించలేదని అన్నాడు. 'టీమ్‌ఇండియా కప్ నెగ్గడం నాకు ఆశ్చర్యంగా ఏమీ అనిపించలేదు. ఎందుకంటే రోహిత్ స్కూల్ డేస్ లోనే జట్టుకు కెప్టెన్‌గా అద్భుతందా వ్యవహరించాడు. ఇది చెయ్, అది చెయ్ అని నేనెప్పుడూ అతడికి చెప్పలేదు'.



## 'బుమ్రా ఎక్కువ వికెట్లు పడగొట్టినా

# షమినే టాప్ బౌలర్!'

టీమ్‌ఇండియా సీనియర్ పేసర్ మహ్మద్ షమిపై వెస్టిండీస్ దిగ్గజ పేసర్ ఆండీ రాబర్ట్స్ ప్రశంసలు కురిపించాడు. యార్కర్ కింగ్ జస్ప్రీత్ బుమ్రా ఎక్కువగా వికెట్లు పడగొట్టినా షమీనే కంప్లీట్ ప్యాకేజీ అని పేర్కొన్నాడు. షమీకి బౌలింగ్ యాక్షన్‌పై కంట్రోల్ ఉండడమే కాకుండా బంతిని రెండు వైపులా స్వింగ్ చేయడం తన ప్రత్యేకత అని రాబర్ట్స్ అన్నాడు. ప్రస్తుతం టీమ్‌ఇండియాలో అతడే అత్యుత్తమ బౌలర్ అని షమీని కొనియాడాడు.

'షమీ కొంతకాలంగా అత్యుత్తమ బౌలర్‌గా కొనసాగుతున్నాడు. అయితే బుమ్రాకు దక్కినన్ని వికెట్లు షమీకి పడకపోవచ్చు. కానీ, షమీ టీమ్‌ఇండియా టాప్ క్లాస్ బౌలర్. అతడు ఓ ఫుల్ ప్యాకేజీ. జట్టులో ఉన్న మిగిలిన వాళ్లకంటే షమీ నిలకడగా రాణిస్తాడు. అతడు బంతిని స్వింగ్ చేయగలడు, సీమ్ చేయగలడు. అంతేకాకుండా బంతిని బుమ్రా కంటే ఎక్కువగా కంట్రోల్ చేయగలడు' అని రాబర్ట్స్ ఓ వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించాడు. కాగా, రాబర్ట్స్ 1974 83 మధ్య కాలంలో వెస్టిండీస్‌కు ప్రాతినిధ్యం వహించాడు. 9ఏళ్ల కెరీర్ లో మొత్తం 47 టెస్టుల్లో 25.21 యావరేజ్‌తో 202 వికెట్లు పడగొట్టాడు.ప్రస్తుతం షమీ ఫామ్ అందిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలోనే సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో ఆడుతున్నాడు. సోమవారం జరిగిన ప్రీ క్వార్టర్ ఫైనల్ లో చండీగఢ్‌పై బ్యాటింగ్‌లో రఫ్ఫాడించాడు. 17 బంతుల్లోనే 32 పరుగులు బాదాడు. ఆఖరి ఓవర్లో స్ట్రైకింగ్‌లో ఉన్న షమీ రెండు సిక్స్‌లు, ఓ ఫోర్ సహా 19 పరుగులు బాదాడు. ఇందులో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు ఉండడం విశేషం.మరోవైపు టీమ్‌ఇండియాలోకి వచ్చేందుకు షమీ తీవ్రంగా శ్రమిస్తున్నాడు. గతేడాది వన్డే వరల్డ్ కప్‌లో గాయపడ్డ షమీ అప్పట్నుంచి టీమ్‌ఇండియాకు దూరమయ్యాడు. ప్రస్తుతం ఆస్ట్రేలియాలో జరుగుతున్న బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో ఆడతాడని ప్రచారం సాగుతోంది. అయితే బీసీసీఐ సెలక్షన్ కమిటీ కూడా షమీని ఎప్పటికప్పుడు పరిశీలిస్తుంది. అతడు ఎంత త్వరగా పూర్తి స్థాయి ఫిట్‌నెస్ అందుకుంటే అంత తొందరగా అంతర్జాతీయ క్రికెట్‌లో రీ ఎంట్రీ ఇస్తాడు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2013/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in